




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 211 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 7 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 211 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 7 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# కమనీయం...రమణీయం





**భద్రాచలంలో కమనీయంగా సీతారాముల కల్యాణం...**
**పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**

- రామ నామస్మరణతో మార్మోగిన భద్రాచలం
- వైభవంగా సీతారాముల కల్యాణం



- సతీసమేతంగా భద్రాద్రికి తరలివచ్చిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన మిథిలా స్టేడియం వేడుకకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల, పొంగులేటి
- నేడు పట్టాభిషేక మహోత్సవం
- చీఫ్ గెస్టుగా విచ్చేయనున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది

- GolStats తాజా గణాంకాలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- మన రాష్ట్రం 8.21% వృద్ధిని సాధించిందని వెల్లడి
- కలసికట్టుగా కృషి చేసి మరింత ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపు



పెన్ పవర్ డెస్క్:రఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. 2024-25 సంవత్సరానికి గాను మన రాష్ట్రం దేశంలోనే రెండవ అత్యధిక వృద్ధి రేటును నమోదు చేసినట్లు GolStats తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు.

“మన రాష్ట్రం 8.21% వృద్ధిని సాధించింది. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే మన విధానాలు ఆంధ్రప్రదేశ్‌ను సంక్షోభం నుంచి వృద్ధి పథంలోకి తీసుకెళ్లాయి. రాష్ట్రాన్ని నూతన విశ్వాసంతో ముందుకు నడిపించాయి. వ్యవసాయం, తయారీ, సేవల రంగాల్లో విస్తృత పునరుజ్జీవనం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారీ పెట్టుబడులు ఈ ప్రగతికి చోదకాలుగా నిలిచాయి. ఈ సామూహిక విజయానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ నా అభినందనలు. మనం కలసికట్టుగా కృషి చేసి మరింత ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మిద్దాం” అని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియాలో ఏపీ ఘనతపై వచ్చిన కథనం క్లిప్పింగ్ ను కూడా చంద్రబాబు తన ట్వీట్ లో పంచుకున్నారు.

## బీజేపీ నేతలకు, కార్యకర్తలకు శు భాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

- బీజేపీ 46వ వ్యవస్థాపక దినోత్సవం
- బీజేపీ ఘనతలను ప్రస్తావించిన పవన్ కల్యాణ్
- దేశవ్యాప్తంగా లక్షలాది మంది విశ్వాసాన్ని పొందిన పార్టీగా అభివృద్ధి చెందిందని కితాబు



పెన్ పవర్ డెస్క్:భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 46వ వ్యవ స్థాపక దినోత్సవాన్ని జరుపుకుం టున్న సందర్భం గా జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బీజేపీ నేతలకు, కార్యకర్తలకు హృదయపూర్వక

వివరాలు 2లో..

## కొందరు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు... సీఎం స్టాలిన్ పై మోదీ విమర్శలు

- తమిళనాడుకు నిధులపై స్టాలిన్‌కు మోదీ కౌంటర్
- నిధుల కేటాయింపుపై స్పష్టీకరణ
- గతంతో పోలిస్తే తమిళనాడుకు మూడు రెట్లు ఎక్కువ నిధులు ఇస్తున్నామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులోని రామేశ్వరంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన ఆరోపణలను

వివరాలు 2లో..

## ట్రంప్ కు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన..

- వాషింగ్టన్ డీసీలో రోడ్లపైకి వేలాదిగా జనం
- మొత్తం 50 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అమెరికన్లు
- ట్రంప్ నిర్ణయాలతో దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన




పెన్ పవర్ డెస్క్:అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ట్రంప్, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 50 రాష్ట్రాల నుంచి ప్రజలు ఈ ఆందోళనలలో పాల్గొన్నారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక జరిగిన అతిపెద్ద నిరసన కార్యక్రమం

వివరాలు 2లో..

## అయోధ్యలో అద్భుతం..

## బాల రాముడి నుదిటిని తాకిన సూర్యకిరణాలు



పెన్ పవర్ డెస్క్: శ్రీరామ నవమి శుభ సందర్భంగా అయోధ్య రామాలయంలో అద్భుతం చోటుచేసుకుంది. నవమి రోజున బాలరామయ్యకు మధ్యాహ్నం12 గంటలకు అభిషేకం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం12 గంటలకు సూర్యకిరణాలు బాలరాముడి నుదిటిపై నాలుగు నిమిషాల పాటు ప్రసరించాయి. ఈ దివ్యఘట్టాన్ని ‘సూర్య తిలకం’ అని పిలుస్తారు. ఆలయంలో జరిగిన అద్భుతాన్ని యావత్ దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రామ భక్తులు తిలకించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది ఆలయ ట్రస్ట్. ఈ దివ్య సంఘటన రాముడి జననాన్ని ప్రతీకగా సూచిస్తుంది. సూర్యకిరణం దేవత నుదిటిపై ప్రకాశింపజేసి వేడుకలకు ఆధ్యాత్మిక ప్రకాశాన్ని జోడించింది.

## తిరుమల శ్రీవారి సేవలో ఏపీ హోంమంత్రి



- కుటుంబంతో కలిసి స్వామి వారి దర్శనం
- అభివృద్ధిలో రాష్ట్రం ముందుండాలని వేడుకున్నట్లు వెల్లడి
- రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన హోంమంత్రి అనిత

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ హోంమంత్రి వంగలపూడి అనిత శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ఆమె కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు, అర్చకులు హోంమంత్రికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో అనిత కుటుంబం స్వామివారి సేవలో పాల్గొంది. మొక్కులు చెల్లించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో ఆలయ పండితులు హోంమంత్రికి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### జగన్ కు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ ఉంటుందా? డౌటేనట

వైసీపీ అధినేత జగన్ కు పెద్ద సమస్య వచ్చిపడిందంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం ఉండకపోవచ్చని అంటున్నారు. ముఖ్యంగా న్యాయవాది, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సన్నిహితుడిగా ముద్రపడిన ఉండవల్లి అరుణ్ కుమార్ ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎందుకంటే జగన్ పై ఉన్న కేసులు తుది దశకు చేరుకున్నాయి. వీటితో పాటు కొత్త కేసులు కూడా మెడకు చుట్టుకునే అవకాశముంది. 2014 కు ముందు నమోదయిన క్విడ్ ప్రోకో కేసుల్లో ఇంకా తీర్పు వెలువడలేదు. దీంతో పాటు తాజాగా మద్యం కేసు కూడా మెడకు చుట్టుకునే అవకాశముందన్నది ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయంగా ఉంది. క్విడ్ ప్రోకో కేసుల్లో జగన్ కు శిక్షపడితే ఇక 2029 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదని ఆయన చెబుతున్నారు.

**కేసులతో ఉక్కిరిబిక్కిరి...**

ప్రస్తుతం బీజేపీతో సయోధ్యగా కొనసాగిస్తున్నప్పటికీ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ లు కూడా మోదీ సర్కార్ పై వత్తిడి తెచ్చే అవకాశముంది. ఎందుకంటే గత ఎన్నికలలోనే జగన్ కు నలభై శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పటి వరకూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు పర్చకపోవడంతో కూటమి ప్రభుత్వంపై కొంత ప్రజల్లో అసహనం, అసంతృప్తి ఉంది. రానున్న నాలుగేళ్లలో సూపర్ సిక్స్ హామీలు చేసినా సహజంగా అధికారంలో ఉండే ప్రభుత్వ వ్యతిరేకత కొంత మూడు పార్టీలకు ఇబ్బందికరంగా మారుతుంది. జగన్ మాత్రం వచ్చే ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తారు. ఎవరితోనూ పొత్తుకు వెళ్లరు. ఈ విషయంలో మరో అనుమానానికి తావులేదు.

**ఏ మాత్రం తేడా కొడితే...?**

ప్రస్తుతం కూటమిలో ఉన్న మూడు పార్టీలు కలసి పోటీ చేసినా ఏమాత్రం తేడా కొట్టినా ఓట్ల శాతం మారితే సీట్లు కూడా గల్లంతవుతాయి. అందుకే జగన్ పోటీ చేసే అవకాశం కోల్పోతే వైసీపీ నేతలు మానసికంగా సగం అపజయం పాలయినట్లేనన్న లెక్కలో ఉన్నారు. అదే సమయంలో ప్రజలు కూడా జగన్ కాకుంటే మరొకరు ఎవరికైనా ఇంతటి హైప్ లభించే అవకాశం ఉండకపోవచ్చన్న అంచనాలున్నాయి. అందుకే వైఎస్ జగన్ పై గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న క్విడ్ ప్రోకో కేసులలో కనీసం రెండు మూడేళ్ల శిక్షను విధించినా పోటీ చేయడానికి అనర్హత వేటు పడే అవకాశముందని కూడా ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. ఇప్పటికే ఈ కేసుల విచారణ లో వేగం పుంజుకుంది.

**పోటీకి అనర్హత...?**

ఈ నేపథ్యంలోనే ఏ మాత్రం జైలుశిక్ష పడితే ఇక జగన్ కు 2029 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశముండదన్నది ఉండవల్లి అరుణ్ కుమార్ విశ్లేషణగా ఒక టీవీ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూను బట్టి తెలుస్తోంది. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో వైఎస్ భారతిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాల్సి ఉంటుంది. జగన్ ను కట్టడి చేయాలన్నా, వైసీపీ నుంచి ముప్పు తప్పించుకోవాలనుకున్నా జగన్ కు శిక్షపడటం ఒక్కటే మార్గం. శిక్షపడితే ఎవరూ ఏమీ చేయకుండానే జగన్ పార్టీ సులువుగా దెబ్బతినే అవకాశాలున్నాయి. అందుకే ఈ విషయం తెలిసిన కొందరు సీనియర్ నేతలు, జగన్ కు సన్నిహితంగా ఉన్న లీడర్లతో పాటు బంధువులు కూడా పార్టీని వీడి వెళ్లారంటున్నారు. అయితే అది న్యాయస్థానంలో ఉండటంతో మరి జగన్ విషయంలో జరుగుతున్న ఈ ప్రచారం ఎంత వరకూ నిజమవుతుందన్నది చూడాలి.

# కమనీయం.. రమణీయం





**పెన్ పవర్ డెస్క్:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేలాది భక్తుల సమక్షంలో సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరై సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది. కాగా, భద్రాచలంలోని మిథిలా మైదానంలో సీతారాముల కల్యాణ వేడుకకు వేదికగా నిలిచింది. అభిజిత్ లగ్నంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీరామచంద్రమూర్తి సీతమ్మ మెడలో మాంగల్యధారణ చేశారు. ఈ వేడుకకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం 9 గంటలకు కల్యాణ క్రతువు ప్రారంభం కాగా, 10 గంటల సమయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మిథిలా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. కల్యాణానికి మూడు నెలల ముందే గోటితో ఒలిచిన తలంబ్రాలను దేవాలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. సీతమ్మకు ధరింపజేసే మంగళసూత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడు పోగులు కలిగిన ఈ మంగళసూత్రంలో ఒకటి సీతమ్మ పుట్టింటి వారిది కాగా, మరొకటి అత్తగారింటి వారిది. మూడవ పోగును భక్త రామదాసు తయారు చేయించారు. కల్యాణ ముహూర్త సమయం 12.02 నిమిషాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ జీలకర్ర బెల్లంను అద్దారు. ఆ తరువాత మాంగల్యధారణ మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. భక్తుల రామ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. సీతారాముల కల్యాణ ఘట్టం 12.40 నిమిషాలకు వైభవంగా ముగిసింది. ఈ వేడుకను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేసవి వేడిని సైతం లెక్కచేయకుండా భక్తులు తరలిరావడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సీతారాముల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



అటు, ప్రతి సంవత్సరము టీటీడీ తరుపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తుంది. ఈ సందర్భంగా ముందుగా భద్రాచలం ఆలయం వద్దకు సతీసమేతంగా చేరుకున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం టీటీడీ ఛైర్మన్ దంపతులు సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు.

## కొందరు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు...
# సీఎం స్టాలిన్ పై మోదీ విమర్శలు

- మొదటి పేజీ తరువాయి

ఆయన ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు భారీగా నిధులు కేటాయిస్తోందని, గత ప్రభుత్వంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ నిధులు ఇచ్చామని మోదీ స్పష్టం చేశారు. "కొందరు కారణం లేకుండానే ఎప్పుడూ ఏడుస్తూ ఉంటారు" అంటూ స్టాలిన్ సహా ఇతర పార్టీల నేతలపై మోదీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని, తమిళనాడును విస్మరిస్తోందని స్టాలిన్ చేసిన ఆరోపణలను ఆయన పరోక్షంగా తిప్పికొట్టారు. గత దశాబ్దంలో తమిళనాడు అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయించిందని, రైల్వే ప్రాజెక్టులకు నిధులు గణనీయంగా పెంచామని మోదీ వివరించారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. కేంద్రం తమకు నిధులు ఇవ్వడం లేదని స్టాలిన్ చేస్తున్న ఆరోపణలను మోదీ ఖండించారు.

అభివృద్ధి చెందిన భారతదేశంలో తమిళనాడు పాత్ర చాలా గొప్పదని అన్నారు. తమిళనాడు ఎంత బలంగా ఉంటే భారతదేశం అంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

తమిళనాడు అభివృద్ధికి నిధుల కేటాయింపుపై స్పష్టతనిచ్చారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించినట్లు తెలిపారు. దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం తమిళనాడు అభివృద్ధికి గతంలో కంటే మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించిందని మోదీ పేర్కొన్నారు. 2014కు ముందు రైల్వే ప్రాజెక్టుకు ఏటా రూ.900 కోట్లు మాత్రమే వచ్చేవని, ఈ ఏడాది తమిళనాడు రైల్వే బడ్జెట్ రూ.6,000 కోట్లకు పైగా ఉందని అన్నారు. భారత ప్రభుత్వం ఇక్కడ 77 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తోందని, ఇందులో రామేశ్వరంలోని రైల్వే స్టేషన్ కూడా ఉందని ఆయన తెలిపారు.

# ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో వైసీపీ నేత అంజాద్ బాషా సోదరుడి అరెస్ట్



వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేశారు. ఆయన కువైట్ వెళ్ళడానికి ప్రయత్నిస్తుండగా ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కడపలో నమోదైన కేసులకు సంబంధించి లుక్ అవుట్ నోటీసులు జారీ కావడంతో ఆయనను అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. అనంతరం అహ్మద్ బాషాను కడప పోలీసులకు అప్పగించారు. కడపలోని వినాయకనగర్‌లో స్థలం విషయంలో దాడికి పాల్పడినట్లు అహ్మద్ బాషాపై కేసు నమోదైంది. అంతేకాకుండా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, శ్రీనివాస్ రెడ్డిని దూషించినందుకు కూడా అతడిపై కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, దేశం విడిచి వెళుతుండగా ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకున్నారు. అహ్మద్ బాషాను కడపకు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచనున్నారు.

# ట్రంప్ కు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన..

- మొదటి పేజీ తరువాయి

ఇదేనని అక్కడి రాజకీయ వర్గాలు తెలిపాయి. ముందుచూపు లేకుండా ట్రంప్, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వాణిజ్య యుద్ధాలు జరుగుతాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తూ మస్క్ తీసుకున్న నిర్ణయంపైనా నిరసన వ్యక్తం చేశారు. 'హ్యాండ్స్ ఆఫ్!' పేరుతో దేశవ్యాప్తంగా 1,200 పైగా ప్రదేశాలలో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. 'ట్రంప్ గో బ్యాక్', 'హాండ్స్ ఆఫ్ డెమోక్రసీ', 'మస్క్ వాస్ నాట్ ఎలెక్టెడ్' వంటి నినాదాలతో వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, చికాగో, మయామీ వంటి నగరాల్లోని స్టేట్ క్యాపిటల్ భవనాలు, ఫెడరల్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ అమలు చేస్తున్న వలస వ్యతిరేక విధానాలు, టారిఫ్ ల విధింపు, మస్క్ చేతిలో ప్రభుత్వ డేటా గోప్యతపై ప్రజలు తమ ఆందోళనలను కేంద్రీకరించారు.

# ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్... ఆ ముగ్గురికి దిమ్మదిరిగింది!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త పన్నుల విధానాన్ని ప్రకటించడంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. అపర కుబేరులు మార్క్ జుకర్‌బర్గ్, జెఫ్ బెజోస్, ఎలాన్ మస్క్ ఒక్కరోజులోనే భారీగా నష్టపోయారు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ సంపద ఒక్కరోజులో 17.9 బిలియన్ డాలర్లు (రూ.1.5 లక్షల కోట్లు) తగ్గింది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 16 బిలియన్ డాలర్లు (రూ.1.3 లక్షల కోట్లు), టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ 8.7 బిలియన్ డాలర్ల (రూ.74 వేల కోట్లు) నష్టాన్ని చవిచూశారు. ట్రంప్ ప్రభుత్వం వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలు విధించడంతో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు గురయ్యాయి. దీంతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే మొదట అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఇదే అతిపెద్ద ఆర్థిక పతనం అని నిపుణులు చెబుతున్నారు. పన్నుల ప్రభావం వల్ల వ్యాపార వ్యయాలు పెరగడం, ప్రపంచ వాణిజ్యం మందగించడం, సాంకేతిక రంగం పనితీరు దిగజారడం వంటి కారణాల వల్ల ఇన్వెస్టర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు.

ఇతర సంస్థల వ్యవస్థాపకులు, సీఈఓల నష్టాలు

ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ 7.4 బిలియన్ డాలర్లు (రూ.63 వేల కోట్లు) నష్టపోయారు.

మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ 774 మిలియన్ డాలర్లు (రూ.6,363 కోట్లు) నష్టపోయారు.

ల్ఫాబెట్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ వరుసగా 4.9 బిలియన్ డాలర్లు (రూ.41 వేల కోట్లు), 4.6 బిలియన్ డాలర్లు (రూ.39 వేల కోట్లు) నష్టపోయారు.

ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ 18 మిలియన్ డాలర్లు (రూ.153 కోట్లు) నష్టపోయారు.

ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ 68 మిలియన్ డాలర్ల (రూ.581 కోట్లు) నష్టాన్ని చవిచూశారు.

**అమెరికా మార్కెట్ల పతనం**

ట్రంప్ ప్రకటనతో అమెరికా మార్కెట్లు 2022 నాటి కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఎస్ అండ్ పి 500 సూచిక 275.05 పాయింట్లు తగ్గి 5,395.92 వద్ద ముగిసింది. నాస్‌డాక్ కాంపోజిట్ 1,053.60 పాయింట్లు తగ్గి 16,547.45 వద్ద ముగిసింది. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1,682.61 పాయింట్లు తగ్గి 40,542.71 వద్ద ముగిసింది.

# బీజేపీ నేతలకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ వంటి దూరదృష్టి గల నాయకుల నేతృత్వంలో బీజేపీ ప్రయాణం ప్రారంభమైందని వెల్లడించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ప్రజాస్వామ్యబద్ధమైన ప్రత్యామ్నాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ పార్టీ ఏర్పడిందని తెలిపారు. జాతీయ సేవ ప్రాతిపదికన రూపుదిద్దుకున్న ఒక ఆదర్శం, దేశవ్యాప్తంగా కోట్లాది మంది విశ్వాసాన్ని పొందిన పార్టీగా అభివృద్ధి చెందిందని కొనియాడారు.

"నేడు జేపీ నడ్డా నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వ్యూహాత్మక ముందు చూపుతో, బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది... కేంద్రంలో వరుసగా మూడు పర్యాయాలు సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ శుభ సందర్భంలో, బీజేపీ జాతీయ నాయకత్వానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి, దేశ నిర్మాణానికి అంకితమైన కార్యకర్తలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో ఏపీ హోంమంత్రి

- మొదటి పేజీ తరువాయి

అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు.

శ్రీరామనవమి రోజు శ్రీవారిని దర్శించుకోవడం తనకు దక్కిన అదృష్టమని ఆమె అన్నారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముందుండాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖ:సంతోషాలతో ఉండాలని తిరుమలేశుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. విజన్- 2047, పీ-4 విధానంతో రాష్ట్ర ప్రజలను సంపన్నులుగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## శ్రీవారి దర్శనంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా





**తిరుమల, పెన్ పవర్ ఏప్రిల్ 06 :** శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా మొదటిసారిగా తిరుమలకు విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామల రావు, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు మేళతాళాల మధ్య వేద మంత్రాలు నడుమ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సంప్రదాయబద్ధంగా ఇష్టికఫాల్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం తరువాత భారత ప్రధాన న్యాయమూర్తి ని అర్చకులు శేష వస్త్రం కప్పిన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అటు తరువాత టీటీడీ ఈవో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్ ఛార్జ్ సీవీఎస్వో శ్రీ హర్షవర్ధన్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రూ.7.50 కోట్లతో రహదారుల అభివృద్ధికి

# నిధులు మంజూరు

### - మంత్రివర్యులు పయ్యావుల కేశవ్



**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్, ఏప్రిల్ 06 :** జిల్లాలోని ఆర్&బి పరిధిలో ఉన్న ప్రధాన రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.7.50 కోట్ల నిధులు మంజూరు కావడం జరిగిందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రహదారుల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కట్టబడి ఉందన్నారు. జిల్లాలోని రహదారుల అభివృద్ధిలో భాగంగా ఆర్&బి పరిధిలో గల మూడు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రధాన జిల్లా రహదారి అయిన ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని హావలిగి రహదారి నుండి ఉరవకొండ వరకు 15/620 నుండి 19/620 వరకు రహదారి మెరుగుదలలో భాగంగా 4 కిలోమీటర్ల రహదారికి 2 కోట్ల రూపాయల నిధుల మంజూరయ్యాయని తెలిపారు. ప్రధాన జిల్లా రహదారి అయిన ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని రామసాగరం నుంచి బోరంపల్లి వరకు 19/5 నుంచి 23/0 వరకు 3.5 కిలోమీటర్ల రహదారికి 1 కోటి 50 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. రాష్ట్ర రహదారి అయిన ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని కనేకల్ రహదారికి 0/0 నుంచి 12/0 వరకు 8 కిలోమీటర్ల రహదారి మెరుగుదలకు 4 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**బీజేపీ కార్యదర్శులు, కార్యకర్తలు నిస్వార్థంగా, సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజల కోసం పనిచేస్తున్నారు**

**2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి**

**ప్రభుత్వ పథకాలను ప్రజల వరకు చేరవేసే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలి - ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్**







**అనంతపురం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, అనంతపురం నగరంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జెండా ఆవిష్కరణ చేసి, దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఒకప్పుడు కేవలం 2 సీట్లతో ప్రారంభమైన బీజేపీ ప్రయాణం, ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీగా మారడమంటే, అది కార్యకర్తల అంకిత భావానికి నిదర్శనం. బీజేపీ కార్యదర్శులు, కార్యకర్తలు నిస్వార్థంగా, సైద్ధాంతిక నిబద్ధతతో ప్రజల కోసం పనిచేస్తున్నారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన నాయకులు ఈ పార్టీ పునాదులు. బీజేపీ కుటుంబ పాలనలో నమ్మకంతో కాక, ప్రజాపాలనలో నిబద్ధతతో ముందుకు సాగుతోంది. ఇది దేశ ప్రజలు గుర్తించి మాకు వరుస విజయాలు అందిస్తున్నారు అని పేర్కొన్నారు. ఆయన, భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని విశ్వగురుగా నిలిపేందుకు శతవిధాలా తరువాయి 5లో..

## కన్నులపండువగా శ్రీ సీతారాముల కళ్యాణం

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, దంపతులు



**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 06 :** శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ దంపతులు హాజరయ్యారు. ఆదివారం అనంతపురం రెవెన్యూ సొసైటీ మరియు రెవెన్యూ అసోసియేషన్, రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కృష్ణ కళామందిర్ లో ఉన్న శ్రీ సీతారాముల దేవాలయంలో జిల్లా కలెక్టర్ దంపతుల చేతుల మీదుగా శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, అనంతపురం రెవెన్యూ సొసైటీ మరియు రెవెన్యూ అసోసియేషన్, రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు కుల్లాయప్ప, గౌని సంజీవరెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, దివాకర్, భరత్, సంజీవ రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న

# మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు



**బనగానపల్లి, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్, ఏప్రిల్ 6 :** శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అలాగే నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలియజేశారు. సకల గుణాభి రాముడు.. పితృ వాక్య పరిపాలకుడు.. ఏకపత్ని వ్రతుడు.. కష్టాలకు ఎదురు ఎదురొడ్డి నిలిచిన మహనీయుడు.. అయోధ్య నేలిన శ్రీరామచంద్రుడు.. అని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఎన్ని యుగాలు గడిచినా శ్రీరాముడి జీవితం సర్వదా ఆదర్శ ప్రాయం.. ఒకే మాట.. ఒకే బాణం.. ఒకే సహధర్మచారిని.. ఇదే రాముని విధానం.. అందరికీ ఆచరణీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి – బీసీ ఇందిర రెడ్డి దంపతులు మరియు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, బనగానపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు వేలాది మంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా, కనుల విందుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తదితర అధికారులతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ మహోత్సవానికి బనగానపల్లి వ్యాప్తంగా భారీ ఎత్తున జన సందోహం తరలివచ్చి శ్రీ సీతారాముల కళ్యాణం తిలకించి.. భక్తిశ్రద్ధలతో తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



## తిరుపతి పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన

## ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత్ దాస్



**రేణిగుంట/పెన్ పవర్/ఏప్రిల్ 06 :** రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని ఆదివారం ఉదయం తిరుగుపయనమైన భారత ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత్ దాస్‌కి రేణిగుంట విమానాశ్రయం నందు సాదర వీడ్కోలు పలికిన తిరుపతి జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ఎస్, జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత దాస్‌కి జిల్లా కలెక్టర్ ఎంతో ప్రసిద్ధి గాంచిన ఏర్పేడు మండలం మాధవమాల ఉడ్ కార్వింగ్ ఆర్టిజాన్ క్లస్టర్ నందు తయారు చేయబడిన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమ జ్ఞాపికను, అలాగే శ్రీకాళహస్తి కలంకారి క్లస్టర్ నందు తయారు చేయబడిన కలంకారి క్యాన్వాస్‌ను అందించారు. ఉత్తమ హ్యాండీ క్రాఫ్ట్ ఉడ్ కార్వింగ్ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రపంచ పర్యాటక దినోత్సవం-2024 సందర్భంగా తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మాధవమాల హ్యాండీ క్రాఫ్ట్ ఉడ్ కార్వింగ్ ఎంపిక కాబడి ఆం.ప్ర ముఖ్య మంత్రి వర్యుల చేతుల మీదుగా అవార్డు పొందడం జరిగిందని, అలాగే జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారి క్లస్టర్ వాటి ప్రాశస్త్యాన్ని కలెక్టర్ వివరించారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఉయ్యాల ప్రవీణ్



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 6 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి,జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తన జన్మదినం సందర్భంగా దేవదేవుని దర్శనార్థం తిరుమలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ కుమార్ ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయకులతోపాటు తిరుమలలో మంత్రి నాదెండ్ల మనోహర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీరాముని పాలన ...మా ఎన్డీయే ప్రభుత్వ పాలన : రాష్ట్ర మంత్రి టి.జి.భరత్





**పెన్ పవర్ బుధవార పేట .రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** శ్రీరాముని పాలన ఏ విధంగా ఉండేదో అదే విధంగా తమ ఎన్డీయే ప్రభుత్వ పాలన ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు.

శ్రీరామనవమి పురస్కరించుకుని నగరంలోని ఆలయాలను ఆయన సందర్శించారు. లేబర్ కాలనీ, కప్పల్ నగర్, వెంకటరమణ కాలనీ, సీతారామ్ నగర్, శ్రీరాం నగర్, అరోరా నగర్, బిర్లాగడ్డ, బుధవారపేట, బాబూజీ నగర్, దండగేరి, రాంబొట్ల దేవాలయం, జొహరాపురం, కొత్తపేట ప్రాంతాల్లోని ఆలయాలను సందర్శించి సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనం స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వంపై రాములవారి ఆశీస్సులు ఉండాలన్నారు. అయోధ్యలో రాముని ఆలయం నిర్మాణం పూర్తైన ఈ తరంలో మనం పుట్టడం మన అదృష్టమన్నారు.

## ట్రంప్ టారిఫ్ వార్...
## కేంద్రమంత్రికి లేఖ రాసిన సీఎం చంద్రబాబు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధానికి తెరలేపడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు మొదలయ్యాయి. ఎక్కడో ఉన్న ట్రంప్ విధించిన సుంకాల కారణంగా ఇక్కడ ఏపీలోని ఆక్వారంగం కూడా ప్రభావితమవుతోంది. దీనిపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన నేడు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు లేఖ రాశారు. భారత్‌పై అమెరికా 27 శాతం సుంకం విధింపు కారణంగా దేశీయ ఆక్వా రైతులు నష్టపోతున్నారని తన లేఖలో పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం విధిస్తున్న అధిక సుంకాలను తగ్గించాలని, తద్వారా ఆక్వా ఉత్పత్తులకు మినహాయింపు కల్పించాలని ఆయన ఆ లేఖలో కోరారు. అధిక టారిఫ్ ల వల్ల మన ఆర్డర్లను ఇతర దేశాలు రద్దు చేసుకుంటున్నాయని, దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేయడానికి కూడా స్థలం లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర జీడీపీలో మత్స్యరంగం ఒక ముఖ్యమైన భాగమని గుర్తు చేస్తూ, ఈ సంక్షోభ సమయంలో ఆక్వా రైతులకు అండగా ఉండాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. ఆక్వా రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చిన చంద్రబాబు, ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, స్పెషల్ కోర్ట్ జడ్జిలు



**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** ఘనంగా శ్రీరామనవమి పండుగ శ్రీరామనవమి పండుగ కార్యక్రమాల్లో భాగంగా శ్రీ రామాలయం, రెవెన్యూ కాలనీ నందు నాలుగవ తారీకు నుండి వరుసగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా 4వ తేదీ శ్రీ రాం జయరాం జయజయ రాం జపం నిర్వహించారు. 5వ తేదీ శ్రీరామ తారక మంత్ర జపం, హోమాలు నిర్వహించారు. 6వ తేదీ శ్రీ సీతా రామ కళ్యాణం గొప్పగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని భక్తులు ఎక్కువగా హాజరై భక్తి ప్రపత్తులతో కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు అనంతపురం పార్లమెంట్ సభ్యులు లక్ష్మీనారాయణ, స్పెషల్ కోర్ట్ జడ్జి శివశంకర్ హాజరై శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ దేవదేవుడైన శ్రీరాముని ఆశీస్సులతో అనంతపూర్ పట్టణ ప్రజలు, రాష్ట్ర మరియు దేశ వ్యాప్తంగా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మరియు అభివృద్ధి వైపు ప్రయాణించాలని ఆకాంక్షించారు. సాయంత్రం రెవెన్యూ కాలనీలో పుర విధులలో నగర ఉత్సవం శ్రీరామ పరివార సమేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమవంలో కమిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి సి.కృష్ణ మూర్తి, సభ్యులు అంబరపు కృష్ణ, గురు మూర్తి రెడ్డి, ఎం.సోమసుందరం, జిల్లా పౌర సంబంధాల అధికారి గురుస్వామి, బాల రంగయ్య, పురోహితులు భారత్ శర్మ, సాయి కృష్ణ శర్మ, కృష్ణ కుమార్ శర్మ, చంద్ర శేఖర్ శర్మ తదితరులు సీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు.



## కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** ఈనెల 7వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్‌కి వరి పైరు మోసులతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాళహస్తి రైతులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 6 :** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పి.ఏ.సి చైర్మన్ నాదెండ్ల మనోహర్ జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి శ్రీమతి వినుత కోటా ఆధ్వర్యంలో రేణిగుంట విమానాశ్రయం నందు నియోజకవర్గ రైతులు, మహిళలు వినూత్నంగా వరి పైరు మోసులతో శుభాకాంక్షలు తెలిపి, కేక్ కటింగ్ నిర్వహించారు. తిరుమల దర్శనం అనంతరం తిరుగుపయనమైన మంత్రి నియోజకవర్గ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున విమానాశ్రయం వద్దకి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు, పట్టణ అధ్యక్షులు భాగ్య లక్ష్మి, నాయకులు కావలి శివకుమార్, పేట చంద్రశేఖర్, దీనదయాళ్, జనసైనికులు వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా నవమి వేడుకలు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 6 :** శ్రీకాళహస్తి నెహ్రు వీధి పట్టాభి రామ మందిరంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా పాల్గొని రాముల వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని ప్రజలందరికీ శ్రీరాముడు ఆరాధ్య దైవమన్నారు. అయోధ్యలో రామ జన్మభూమిని బాధ్యతగా, ఆత్మ అభిమానానికి చిహ్నంగా భావిస్తున్నామన్నారు.

## శ్రీకాళహస్తి దగ్గర రోడ్డు ప్రమాదం



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 6 :** శ్రీకాళహస్తి పట్టణణ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. టూ టౌన్ సీఐ సమాచారం మేరకు.. తిరుపతి నుంచి నాయుడుపేటకు ఓ కారు బయల్దేరింది. శ్రీకాళహస్తి సమీపంలోని వీఎం పల్లి బ్రిడ్జి వద్ద పంక్చర్ కావడంతో కారు అదుపుతప్పి డివైడర్ దాటి అవతలి వైపునకు దూసుకెళ్లింది. నాయుడుపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న మరో కారును ఢీకొట్టింది. తిరుపతి వైపు వెళ్తున్న కారులో ఉన్నావారికి గాయాలయ్యాయి.

## విద్యుత్ యుజి కేబుల్స్ కాలిపోవడంతో విద్యుత్ శాఖకు రూ. 10 లక్షలు ఆస్తినష్టం



**తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్ 06 :** తిరుపతి సిటి: 06.01.2025 అలిపిరి సెక్షన్ పరిధిలో గల 132 కె.వి. రుయా హాస్పిటల్ అండర్ గ్రౌండ్ కేబుల్స్ ను గుర్తు తెలియని వ్యక్తులు 3 కేబుల్స్ ను మంట పెట్టడంతో విద్యుత్ శాఖకు 10 లక్షలు ఆస్తినష్టం వాటిల్లింది అని ఎస్.ఈ. పీ.సురేంద్ర నాయుడు తెలిపారు. ఈ మేరకు సంఘటన స్థలంకి ఆదివారం సాయంత్రం ఎస్.ఈ.తో పాటు ఆపరేషన్ టౌన్ డివిజన్ ఈ.ఈ. చంద్ర శేఖర్ రావ్ రుయా హాస్పిటల్ ఏమ్.డి. కూడా సంఘటన స్థలన్నీ పరిశీలించారు. పాదచారులకు ఇబ్బంది కలగకుండా వెంటనే మరమ్మతులు ప్రారంభించడం జరిగింది. ఈ సమస్యను పునరావృతం కాకుండా చూసుకోవాలని అన్నారు. ఎస్.ఈ. ఆదేశాలతో మరియు టౌన్ డివిజన్ ఈ.ఈ. సూచనలతో వెంటనే సబ్ డివిజన్ అధికారులు స్పందించి ప్రత్యన్యమయంగా విద్యుత్ సప్లై ఇవ్వడం జరిగింది. ఇందులో ఎస్.ఈ సురేంద్ర నాయుడు తో పాటు టౌన్ డివిజన్ ఈ.ఈ. చంద్ర శేఖర్ రావ్ తో కన్స్ట్రక్షన్ ఈ ఈ. బాలాజీ, పాటు విద్యుత్ ఏడిలు ఆంజనేయులు, ముని ప్రసాద్, ఏ.ఈ.లు ఉమాపతి, భాష, తదితరులు ఉన్నారు.

# చిత్తూరు ఏఆర్ పోలీసుల ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలు







**చిత్తూరు, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 06 :** చిత్తూరు పట్టణం నందు టాప్ లైన్, పి.జి.ఆర్. పోలీసు క్వార్టర్ ల యందు వున్న శ్రీ సీతా రామ దేవాలయాలలో ఆదివారం శ్రీరామ నవమి పండుగ ను పురస్కరించు కొని చిత్తూరు ఏ.ఆర్ పోలీసులు ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం భక్త జనుల సమక్షంలో భక్తి శ్రద్దలతో అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జిల్లా ఎస్.పి. వి.ఎన్. మణికంఠ చందోలు గార్లు కుటుంబ సమేతంగా శ్రీ సీతారాములు వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అడిషనల్ ఎస్.పి. ఏ.ఆర్ శివానంద కిషోర్ దంపతులు కూడా స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్ని భక్తి శ్రద్దలతో పూజా కార్య క్రమాలు నిర్వహించారు.స్వామి వారి ఆలయంలో పూజారులు వేద మంత్రాలతో విశేష పూజలు నిర్వహించిఆశీర్వదించారు.తదుపరి స్వామి వారి ఆశీస్సులు తీసుకొని కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీల చేతుల మీదుగా సుమారు 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సీతారామ కళ్యాణోత్సవంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ రాజశేఖర్ రాజు, చిత్తూరు డిఎస్పీ టి.సాయినాథ్, ఏ.ఆర్. డిఎస్పీ మహబూబ్ బాష,తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి ధ్యేయం

### చేనేత కార్మికుల కోసం మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ - మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం సందర్భంగా ధర్మవరం పట్టణం ఒకటవ వార్డు (గుడ్సేట్ కొట్టాల) నందు బిజెపి జెండా ఆవిష్కరించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, అనంతరం మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ, ముందుగా ధర్మవరం నియోజకవర్గం ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఈ ప్రాంత సమస్యల కోసం కృషి చేస్తూ అభివృద్ధికి తోడ్పడుతూ సంక్షేమ పథకాలు రాజకీయ వివక్ష లేకుండా అందరికీ అందేలా కృషి చేస్తానని అదేవిధంగా పట్టణంలో ప్రజలకు అనుగుణంగా వంద పడకల ఆస్పత్రిని 150 ఆసుపత్రి పడకల చేయడం గాని, లేదా ఐదు పడకల గా ఉన్నాడు దయాలసిస్ సెంటర్‌ని పది పడగల దయాలసి సెంటర్ చెయ్యడం గాని, లేదా ఒకే రోజు 5000 మందికి జాబ్ మేళా నిర్వహించి దాదాపు 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ముఖ్యంగా అభివృద్ధి పైన దృష్టి పెట్టామని గ్రామాల్లో రహదారులు నిర్మాణం చేయడం గాని, లేదా గతంలో ఆగిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు పైన అభివృద్ధి కార్యక్రమాలు మౌలిక సదుపాయాలు కల్పన అదేవిధంగా గ్రామీణ హామీ పథకం కింద ఉపాధి కల్పించడమే కాకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రజల సమస్యలు ఒక్కొక్కటి గుర్తిస్తున్నామని ఆ సమస్యలు పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తున్నామని చేనేత కార్మికుల వారి రుణం తీర్చుకునే విధంగా మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరు చేశామని వాటికోసం స్థల సేకరణ కూడా చేస్తున్నారని వాటిని తొందర్లోనే పనులు ప్రారంభిస్తామని అంతేకాకుండా యువత కోసం ఆకీ స్టేడియం కోసం మంజూరు చేసే ప్రయత్నం చేస్తున్నామని అంతేకాకుండా అనేక రకమైన అభివృద్ధి కార్యక్రమాలు ట్రస్టు ద్వారానే పనిచేయడం కాకుండా ప్రభుత్వ వైపు నుంచి కూడా అనేక రకమైన పనులు చేయడానికి శ్రీకారం చుట్టామని ప్రచార సమయంలో చాలా హామీలు ఇచ్చాం అని వాటిని ఒక్కొక్కటిగా ప్రజలకు తీర్చుకుంటూ ప్రజల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నానని మంత్రి సత్య కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బిజెపి మైనారిటీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, కృష్ణాపురం జమీర్, బిల్లే శ్రీనివాసులు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, కంచుపు నరప్ప, రవికుమార్, అనిల్, నాగేంద్ర, రమేష్ ,బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సామంచి శ్రీనివాస్ మరియు భాను ప్రకాష్ రెడ్డి




**తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్06 :** తిరుపతి సెంట్రల్ మండలం అధ్యక్షులు దీపక్ యాదవ్ మరియు బిజెపి నాయకులు ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక సెంట్రల్ పార్క్ ఎదుట మేళ తాళాల మధ్య టపాకాయలు కాలుస్తూ పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్,రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, హాజరవడం జరిగింది. ముందుగా జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ భరత మాత చిత్రపటానికి పూల మాలలు వేసి కొబ్బరికాయ కొట్టడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ తిరుపతి సెంట్రల్ మండలంలో భారీ స్థాయిలో 45వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తగా ఉన్నందుకు గర్వపడుతున్నానని వారు తెలిపారు. దేశ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న భారతీయ జనతా పార్టీ ఆశయాలను ప్రజలందరికీ చేరవేయాలని కార్యకర్తలను కోరారు. అదేవిధంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీని బలోపేతం చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సుబ్రమణ్యం యాదవ్, పృద్వి రెడ్డి, పార్థసారథి, ప్రసాద్, వెంకటేష్ యాదవ్, డి.వి.రమణ, ప్రకాష్ యాదవ్ మరియు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి గాండ్ల వీధిలో శ్రీరామనవమి వేడుకలు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 6 :** శ్రీరామనవమి సందర్భంగా శ్రీకాళహస్తి కొత్తపేట గాండ్లవీధి, గాండ్ల సంక్షేమ సంఘం నూతనంగా నిర్మించిన శ్రీ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారి దేవాలయం,నూతన చిత్రపట ప్రతిష్ఠ మరియు మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనంతరం శ్రీ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాల్ శెట్టి విజయ్ శేఖర్, రాజేంద్ర, సురేష్, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్,మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, లీలావతి, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, షేక్ సిరాజ్ భాష, పులి రామచంద్రయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జి జయక్రిష్ణ రెడ్డి,సుధాకర్,పటాన్ ఫరీద్,పీఎం చంద్ర, వెంకటేశ్వర్లు, పెరుమాళ్, జూమ్లేష,జీవికె రెడ్డి,నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పసల కృష్ణయ్య, రవితేజ, గిరీష్ కుమార్, తరుణ్, హరికృష్ణ, భరత్,మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి సందర్భంగా రామలక్ష్మికి సన్మానం



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 06 :** చిత్తూరుజిల్లా కేంద్రంలో ఆదివారం కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారాలు జరిగిన సందర్భంగా ప్రముఖ కవి,రచయిత రామలక్ష్మమ్మను పలమనేరు పట్టణ ప్రముఖులు శ్రీపురం సీతారామయ్య సన్మానించారు. అదేవిధంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీపురం సీతారామయ్యని తిరిగి ఆమె దుశ్శాలువతో సన్మానించారు.ఇందులో పలువురు ప్రముఖులు పాల్గొన్న సందర్భంగా అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం చోటుచేసుకుంది.ఈ కార్యక్రమంలో కవి.రచయిత, పలమనేరు బాలాజీతో బాటు పలువురు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 6 :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని బేరివారి మండపం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. సోము మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలో 11 ఏళ్లు భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు.

## 15 నుంచి శ్రీకాళహస్తిలో ముత్యాలమ్మ జాతర



**శ్రీకాళహస్తి, పెన్ పవర్. ప్రతినిధి. ఏప్రిల్ 6 :** శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం అనుబంధ ఆలయమైన ముత్యాలమ్మ జాతరను ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ కలశ స్థాపన, పొంగళ్లు, 16వ తేదీన రేణుకా దేవి అమ్మవారి ముగ్గు, 17న ముత్యాలమ్మ ముగ్గు, అమ్మవారి ఊరే గింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పలువురు నేతలు





**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 5 :** నాయుడుపేట పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రఫీ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న పలువురు నేతలునూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయుడుపేట పట్టణ సమీపంలోని కెఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో ఆదివారం ముస్లిం మైనారిటీ నాయకులకు షేక్ రఫీ కుమార్తె వివాహ మహోత్సవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైసీపీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి,వైసిపి ముస్లిం మైనారిటీ సూళ్లూరుపేట నియోజక వర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్,పట్టణ వైసీపీ అధ్యక్షుడు షేక్ రాహమతుల్లా,నాయుడుపేట ప్రవేట్ పాఠశాలల యూనియన్ నాయకులు పద్మ నాభ రెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంభేటీ విజయభాస్కర్ రెడ్డి,నాయుడుపేట మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగా ప్రసాద్,బీసీ సంక్షేమ సంఘం సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్,టీడీపీ నాయకులు జివిఆర్ నాయుడు,బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తదితరులు వేరువేరుగా వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## కడప మాజీ మంత్రి, వైసీపీ నేత అంజాద్ బాషా తమ్ముడు అరెస్ట్...!!



కడప మాజీ మంత్రి, వైసీపీ నేత అంజాద్ బాషా తమ్ముడు అరెస్ట్...!!
- అహ్మద్ బాషాను ముంబైలో అరెస్ట్ చేసిన కడప పోలీసులు
- టీడీపీ ఎమ్మెల్యే మాధవిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన అహ్మద్ బాషా
- గతంలో శ్రీనివాసులు రెడ్డిపై పీఎస్ లోనే దాడికి యత్నం
- శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదుతో అహ్మద్ పై కేసు నమోదు
- అహ్మద్ పై మరో రెండు కేసులు నమోదైనట్టు సమాచారం.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

(3వ పేజీ తరువాయి) కృషి చేస్తున్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల వరకు చేరవేసే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలి. బీజేపీకి ఇది కేవలం పుట్టిన రోజు కాదు, స్ఫూర్తిదాయకమైన పోరాట పయనం గుర్తు చేసుకునే సందర్భం, అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంపీ రఘునందన్ రావు, కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు కొనగొండ్ల రాజేష్, జిల్లా మాజీ అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాసులు, లలిత్ కుమార్, లక్ష్మీ దేవమ్మ, పోలేటి రత్నమయ్య, చిరంజీవి రెడ్డి, గోవర్ధన్, డోలా రాజారెడ్డి, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, కృష్ణాపురం జమీర్, బిల్లే శ్రీనివాసులు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, కంచుపు నరప్ప, రవికుమార్, అనిల్, నాగేంద్ర, రమేష్, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీతా రాముల కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి పెన్ పవర్– ఏప్రిల్ 6 :** కావలి పట్టణంలోని పలు ఆలయాల్లో ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవం లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. కావలి పట్టణం జనతాపేటలోని రామాలయం, అన్నపూర్ణ క్లాత్ మార్కెట్‌లో జరిగిన సీతారాముల కళ్యాణం, సత్యనారాయణ స్వామి గుడిలో జరిగిన కళ్యాణంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వార్ల ఆశీస్సులు తీసుకున్నారు. రాముని గొప్పతనం గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరణ

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్, ఏప్రిల్ 06 :** నేడు సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను ఉదయం.9.30 గంటల నుండి మధ్యాహ్నం.1 గంట వరకు ప్రజల నుండి సమస్యల అర్జీ లను స్వీకరించబడునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్ర మానికి ఉదయం 9 గంటల కల్లా జిల్లా అధికారులు తప్పకుండా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. నియోజక వర్గ,మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## బిజెపి పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కావలి పెన్ పవర్–ఏప్రిల్ 6 :** భారతీయ జనతా పార్టీ కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఒకటవ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ 45వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పట్టణం లోని శివాజీ సెంటర్ నందు పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు 45వ భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ రక్షణ ధ్యేయంగా స్థాపితమై, ప్రజా సంక్షేమం దేశ నిర్మాణం కోసం అంకితమై కోట్లాది కార్యకర్తల సంఘీభావంతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. చిట్ట చివరి పేదల సంక్షేమమే లక్ష్యంగా అంత్యోదయ విధానంతో ఏకాత్మత మానవ తావాదం ఆచరణగా ఆర్థిక, సాంస్కృతిక జాతీయవాదమే సిద్ధాంతంగా , వికసిత్ భారత నిర్మాణమే లక్ష్యంగా దేశ హితం కోసం పనిచేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. భారతీయ జనతా పార్టీ పూర్వం జన సంఘ్ ఏ లక్ష్యాలను, అజెండాలు దేశ రక్షణ సాంప్రదాయ హిందూ ధర్మాల బలోపేతములను కలిగి ఉన్నాయో నేడు కూడా భాజపా అవే లక్ష్యాలను కలిపి మాట తప్పకుండా ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి దేశ అభివృద్ధికి భారతీయులందరూ సంఘటితంగా సమైక్యంగా భాషలు ప్రాంతాలు వేరైనా భారతీయులందరూ ఒకటే అనే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడానికి మోడీ నాయకత్వంలో భాజపా కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిరం నిర్మాణం, కామన్ సివిల్ కోడ్ రావాలని లక్ష్యంతో జన సంఘ్ ఏర్పడిందని వారిని కొనసాగిస్తూ సాగుతూ ఆర్టికల్ 370 రద్దు చేసిందని అయోధ్య రామ మందిర నిర్మాణం చేపట్టిందని, మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డ్ సవరణలను దిగ్విజయంగా పూర్తి చేసిందని సబ్ కా సాత్, సబ్ కా వికాస్,సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ భావన కలిగి విలక్షణమైన విశిష్టమైన పార్టీ అని, అవినీతికి తావులేని పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంచిపాక కమల, జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరుసు వెంకటేశ్వర్లు, అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిశెట్టి నరేంద్ర, జిల్లా లీగల్ సెల్ కో కన్వీనర్ పాతపాటి రమణారెడ్డి, సీనియర్ నాయకులు, అమరా వెంకట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు టిడిపి కార్యకర్తల సమావేశం

### బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు

**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 6 :**
కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చంద్రశేఖరపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నేడు ఉదయము 10 గంటలకు టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యకర్తల సమావేశం చాలా ముఖ్యమైనదని మండలంలోని 23 గ్రామపంచాయతీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, టిడిపి అనుబంధ సంఘాల నాయకులు టిడిపి కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

## శ్రీరామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్





**ధర్మవరం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్, ఏప్రిల్ 6 :** రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడు ధర్మవరం పట్టణంలో నిర్వహించిన పలు ఆలయాలలోని శ్రీరామ కళ్యాణ మహోత్సవాలలో పాల్గొన్నారు. ఆయన రామ్‌నగర్‌లోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, గీతానగర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, దిమ్మిలి సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి, మంత్రోచ్ఛారాలతో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకుల వేదాశీర్వచ నాలు స్వీకరించిన మంత్రి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, సుఖసంతోషాలతో జీవించాలనే అభీష్టంతో శ్రీరాముని పాదాలవద్ద ప్రార్థనలు చేశారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, శాంతి, భద్రత, అభివృద్ధి సాధ్య పడాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రామా యణంలోని 24 వేల శ్లోకాలు ఆదర్శవంతమైన జీవన విధానం, ధర్మ పాలన గురించి బోధిస్తాయి. మంచి బాలుడు, కుమారుడు, విద్యావంతుడు, గుణవంతుడు, రాజనేత అంటే గుర్తొచ్చేది శ్రీరాముడే, అన్నారు. వాల్మీకి నుంచి విశ్వనాథ సత్యనారాయణ వరకు, ఆంజనేయస్వామి నుంచి భద్రాచల రామదాసు వరకు ఎంతో మంది శ్రీరాముని మహిమను కీర్తించారు.

అలాంటి శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో అద్భుతమైన రామ మందిరాన్ని నిర్మించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిది, అని చెప్పారు. ప్రధానమంత్రి శ్రీరాముని బాటలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దేశాన్ని పాలిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు. మనం కూడా రాముని ఆదర్శాలను అనుసరిస్తూ ధర్మపథంలో ముందుకు సాగాలి, అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బిజెపి మైనారిటీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, అంగజాల రాజు, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, కృష్ణాపురం జమీర్, బిల్లే శ్రీనివాసులు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, అంబటి సతీష్, శ్యామ్ రావు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, కంచుపు నరప్ప, రవికుమార్, అనిల్, నాగేంద్ర, రమేష్ ,బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, తదితరులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోస్టల్ ప్రైవేటీకరణపై 'ఉక్కు పిడికిలి'

### మోడీ కార్పొరేట్ విధానాలను సాగనివ్వం... అఖిల భారత తపాలా ఉద్యోగులు సంఘం




**శ్రీకాళహస్తి/పెన్ పవర్/ఏప్రిల్ 6 :** ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి కార్పొరేట్లకు దోచిపెట్టే మోడీ విధానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ తేల్చి చెప్పింది. మరీ ముఖ్యంగా తపాలా వ్యవస్థను ప్రైవేటీకరించేందుకు భీష్మించుకు కూర్చున్న మోదీ ప్రభుత్వ ప్రయత్నాలపై ఉక్కు పిడికిలి బిగిస్తామని స్పష్టం చేసింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని మహేష్ కల్యాణ సదన్ లో అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్ట్ మెన్, ఎంటీఎస్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. మూడు రోజులు పాటు సమావేశాలు జరుగుతాయి. మొదటి రోజులో భాగంగా సంఘం జాతీయ పతకాన్ని ఎగురవేశారు. అనంతరం శ్రీకాళహస్తి పురవీధుల్లో బారీ ర్యాలీ నిర్వహించారు. చౌకగా సేవలు అందిస్తున్న తపాలా శాఖను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ చర్యలను భారీ నినాదాల ద్వారా నిరసించారు.

ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశారు. తపాలా శాఖను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవడానికి ఉద్యోగులుగా తాము చేస్తున్న పోరాటాలకు సహకరించాలని ప్రజలను అభ్యర్థించారు. ర్యాలీ అనంతరం పోస్టల్ ఉద్యోగుల హక్కుల కోసం అశువులు బాసిన నాయకులకు నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన మహాసభలనుద్దేశించి నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘ సెక్రెటరీ జనరల్ జనార్ధన్ ముజుందార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో అమలు చేస్తున్న విధానాలను పోస్టల్ ఉద్యోగులందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పోస్టుమేన్ కేడర్ ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ఇండిపెం డెంట్ డెలివరీ సెంటర్స్, కామన్ డెలివరీ సెంటర్స్ ను తిప్పి కొట్టాలని పోస్టుమేన్, ఎమ్.టి.ఎస్ జెనరల్ సెక్రెటరీ ఆర్.పి.సారంగ్ కోరారు. మోడీ కార్పొరేట్ల భజన చేస్తూ లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు తాకట్టు పెట్టేస్తున్నాడని ఎంటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కందారపు మురళి విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు మోడీ చర్య గొడ్డలి పెట్టు లాంటిదని మండిపడ్డారు. జి.డి.ఎస్ ఉద్యోగు లకు తక్షణమే సివిల్ సర్వెంట్స్ హోదా కల్పించాలని, కమలేష్ చంద్రా కమిటీలో మిగిలి ఉన్న అన్ని సానుకూల సిఫార్సులను వెంటనే కేంద్ర ప్రభుత్వం అమలుచేయాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జెనరల్ సెక్రెటరీ ఎస్.ఎస్. మహాదేవయ్య డిమాండ్ చేశారు. పోస్టల్ శాఖను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పోస్టల్ యాక్ట్–2023 ను వెంటనే రద్దు చేయడానికి ఉద్యోగులంతా కేడర్ లతో సంబంధం లేకుండా పోరాడాలని ఎన్ఎఫ్‌పిఇ జి.డి.ఎస్.మాజీ జెనరల్ సెక్రెటరీ పాండురంగారావు పిలుపునిచ్చారు. విజయవాడ పోస్టల్ రీజియన్ పోస్టు మాస్టర్ జెనరల్ డీ.ఎస్.వి.ఆర్.మూర్తి, ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు గణపతి, ఎమ్. శ్రీనివాసరావు, వై.మర్రిరెడ్డి, మాజీ రాష్ట్ర సంఘ నాయకులు సుధాకర్, రిసెప్షన్ కమిటీ ఛైర్మన్ ఖుర్షీద్, స్థానిక రిసెప్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిండెంట్ కె.మురళీ, ప్రధాన కార్యదర్శి బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి పెట్టింది పేరు బిజెపి

### అఖిలేష్ యాదవ్ మాటలు అర్థరహితం : బిజెపి రాష్ట్ర నేత సన్నారెడ్డి దయాకర్ రెడ్డి



**ఓజిలి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 6 :** ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి అవతరించిందని ఆ పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా ఓజిలి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి భారతీయ జనతా పార్టీ పెట్టింది పేరని అన్నారు. పార్లమెంట్లో సమాజ్వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ బిజెపి పై చేసిన విమర్శలు అర్థరహితమని ఆయన అన్నారు. భారతీయ జనతా పార్టీలో కింద స్థాయి నుండి పై స్థాయి వరకు నాయకులు ఎన్నుకోవాలంటే ప్రజా స్వామ్య బద్ధంగా సామాన్య కార్యకర్త నుండి అత్యున్నత స్థాయి వరకు ఉన్న వారి అభిప్రాయ ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోవడం జరుగుతుంది అని అన్నారు. సమాజ్ వాజ్ పార్టీ నుండి ఎవరినైనా ఎన్నుకోవాలంటే వారి కుటుంబంలోనే నలుగురు సభ్యులు కూర్చుంటే వారే నాయకులు అవుతారని ఆయన ఎద్దేవా చేశారు. అఖిలేష్ యాదవ్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం బిజెపికి లేదన్నారు. భారతీయ జనతా పార్టీ ఓజిలి మండలంలో సంస్థాగతంగా బలంగా ఉందని అన్నారు. గతంలో మండలంలో జడ్పిటిసిని గెలుచుకున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఓజిలి మండలం బిజెపి నూతన అధ్యక్షునిగా ఎన్నికైన బిల్లు పవన్ కుమార్ ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. రానున్న రోజులలో ఓజిలి మండలంలో బిజెపి మరింత బలపడే విధంగా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు కొండూరు రవీందర్ రాజు, మనోహర్, ఆరుముళ్ళ వరప్రసాద్, కొక్కు శేషయ్య యాదవ్, గోపాల్, శోభన్, కోటి, భాను, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ, మహా నైవేద్యం

**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 6 :** చంద్రశేఖరపురం మండలం మిట్టపాలెం గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నారాయణ స్వామి దేవస్థానంలో శ్రీ నారాయణ స్వామి దైవ నామ స్మరణతో అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు ఆదివారం స్వామివారికి ప్రీతికమైన రోజు కావడంతో ఉదయం నుంచి దర్శనానికి భక్తులు పాల్గొన్నారు ఈ సందర్భంగా శ్రీ నారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మరియు శ్రీ నారాయణ స్వామి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నారాయణస్వామి వారి మూల విరాట్ ను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి అభిషేకోత్సవం అర్చకులు మంకాల ప్రసాద్ శర్మ వేదమంత్రాలతో ఘనముగా నిర్వహించారు ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు తదుపరి భక్తులు మహా నైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి భక్తులందరికీ స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కొమ్మినేని వెంకట్రావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 06 : ఈ నెల 07వ తేదీ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం" కార్యక్రమానికి ఈ నెల 07వ తేదీ ఉదయం 9–30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడ పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏపీ స్టేట్ ఛాంపియన్ షిప్ హాకీ పోటీలు

### ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్






ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 06 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో ఈ నెల 6 తేదీ నుంచి 9వ తేదీ వరకు 15 వ ఏపీ స్టేట్ ఛాంపియన్షిప్ హాకీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. తొలుత క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. హాకీ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా విచ్చేసిన క్రీడాకారులకు ఇరువురు శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమని తెలిపారు. మన ధర్మారంలో రాష్ట్రంలోని హాకీ క్రీడా కారులను ఒక చోటికి చేర్చి పోటీ నిర్వహించడం నిజంగా గర్వించదగ్గ విషయమని నిర్వాహకులను అభినందించారు. ఊక అశ్వత్త నారాయణ మెమోరియల్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో పాటు, చిలక మధుసూదన్ రెడ్డి, తదుపరి ఏపీ స్టేట్ ఉపాధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్, స్టేట్ అధ్యక్షులు చానుక రాజు, స్టేట్ కార్యదర్శి హర్షవర్ధన్, స్టేట్ కోశాధికారి థామస్, సౌత్ రైల్వే ఆఫీసర్ కత్తి గీతారెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం ఒకటవ రోజు జరిగిన హాకీ పోటీలు వివరాలను నిర్వాహకులు తెలుపుతూ చిత్తూర్–కాకినాడ తరపడగా 10 గోల్తో కాకినాడ విజయం, ప్రకాశం–నంద్యాల తలపడగా ఐదు గోల్తో ప్రకాశం విజేత, విశాఖపట్నం–శ్రీకాకుళం తో తలపడగా శ్రీకాకుళం 3.2 గోల్తో విజేత, అన్నమయ్య–మాన్యం తలపడగా అన్నమయ్య 5 గోల్తో విజేత, తిరుపతి–నెల్లూరు తలపడగా తిరుపతి ఐదు కోల్ తో విజేత, అనకాపల్లి–వెస్ట్ గోదావరి తలపడగా రెండు గోల్తో అనకాపల్లి విజేత, కడప–కర్నూలు తలపడగా 12 గోలుతో కడప విజేత గా నిలిచారు. ఈ హాకీ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 22 టీములకు 440 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. మొదటిరోజు హాకీ పోటీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాల అందించిన అందరికీ కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బిజెపి మైనారిటీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, అంబటి సతీష్, శ్యామ్ రావు, కృష్ణాపురం జమీర్, పోతు కుంట రాజు, బిల్లే శ్రీనివాసులు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, కంచుపు నరప్ప, రవికుమార్, అనిల్, నాగేంద్ర, రమేష్ ,బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ, మహా నైవేద్యం



**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 6 :** చంద్రశేఖరపురం మండలం మిట్టపాలెం గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నారాయణ స్వామి దేవస్థానంలో శ్రీ నారాయణ స్వామి దైవ నామ స్మరణతో అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు ఆదివారం స్వామివారికి ప్రీతికమైన రోజు కావడంతో ఉదయం నుంచి దర్శనానికి భక్తులు పాల్గొన్నారు ఈ సందర్భంగా శ్రీ నారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మరియు శ్రీ నారాయణ స్వామి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నారాయణస్వామి వారి మూల విరాట్ ను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి అభిషేకోత్సవం అర్చకులు మంకాల ప్రసాద్ శర్మ వేదమంత్రాలతో ఘనముగా నిర్వహించారు ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు తదుపరి భక్తులు మహా నైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అర్చకులు భక్తులను ఆశీర్వదించి భక్తులందరికీ స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## విష ద్రావణం త్రాగి పది మేకలు మృతి



**అనంతసముద్రం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** విష ద్రావణపు నీరు త్రాగి పది మేకలు మృతి చెందిన సంఘటన ఆదివారం పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం పంచాయతీలో గల పొదలోపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.. పొదలోపల్లి గ్రామంలోని హరిజనవాడకు చెందిన ఊటుకూరు చిన్నబ్బి, పెంచలమ్మ దంపతులు మేకలను మేపుకొని జీవనం సాగించేవారు. ఇదే క్రమంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మేతకు తీసుకు వెళ్లిన మేకలు ఒక పథకం ప్రకారం విషం కలిపి ఉంచిన నీటిని త్రాగాయి.. త్రాగిన కొద్దిసేపటికి 2 మేకపోతులు, 4 మరకలు, 4 మేకలు విలవిలలాడి మృతి చెందాయి .. వీటి విలువ దాదాపు రెండు లక్షల రూపాయల వరకు చేస్తుందని చిన్నబ్బి దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇదే విషయంను 100 కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అదేవిధంగా పుల్లంపేట పోలీసులు కూడా సమాచారం అందించారు. సకాలంలో పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుచున్నారు . తమకు ఉన్న జీవనాదారం పోయింది అని వాపోతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు

### జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 06 :** తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు, డివిజనల్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి ప్రారంభించి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో అందరు జిల్లా అధికారులు కలెక్టరేట్ నందలి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి, అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో పీజీఆర్ఎస్ కు సంబంధిత అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## గొట్లూరులో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

గొట్లూరులో గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్





**ధర్మవరం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 06 :** ధర్మవరం నియోజకవర్గంలోని గొట్లూరులో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణలతో మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. తర్వాత మంత్రి గారు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో, సుఖసంతోషాలతో జీవించాలనే మనస్ఫూర్తి ఆకాంక్షతో పూజలు చేసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, శాంతి, భద్రత మరియు సమగ్ర అభివృద్ధి సాధ్యపడాలని ఆంజనేయ స్వామి దయ కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉట్ల పరుషను కూడా మంత్రి తిలకించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి గారు మాట్లాడుతూ, కులమతాలకతీతంగా ప్రజలు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకం. ఇలాంటి పండుగలు సామాజిక ఐక్యతకు చిహ్నంగా నిలుస్తాయి, అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు, పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర, రూరల్ అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బిజెపి మైనారిటీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, అంగజాల రాజు, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, కృష్ణాపురం జమీర్, బిల్లే శ్రీనివాసులు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, అంబటి సతీష్, శ్యామ్ రావు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, కంచుపు నరప్ప, రవికుమార్, అనిల్, నాగేంద్ర, రమేష్ ,బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, తదితరులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండుగ శోభతో గ్రామం ఉత్సాహభరితంగా మారింది.

# తృప్తి , ఆశకు హద్దులు ఎక్కడ?

**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** తృప్తికి / ఆశకి హద్దు ఎక్కడ?.. అస్సలు ఉండదు ఈరోజుల్లో.. "ఇంకా కావాలి, ఇంకా ఇంకా ఇంకా కావాలి, మొత్తం నాకే కావాలి" ఇదే నేటి మనుష్యుల ఆలోచన.. మేధస్సు మరియు వినోదాన్ని మిళితం చేసే "కౌన్ బనేగా కరోడ్‌పతి" షోని అందరూ ఆనందిస్తున్నారు.. ఇది అందరి జ్ఞానాన్ని పెంచుతుంది కూడా.. మరియు అందరి సమాధానాలు సరైనవి అయినప్పుడల్లా అందరు చాలా సంతోషిస్తారు.. ఇటీవలి ఎపిసోడ్‌లో నీరజ్ సక్సేనా "ఫాస్టెస్ట్ ఫింగర్" రౌండ్‌లో అత్యంత వేగంగా సమాధానమిచ్చి హాట్ సీట్‌లో నిలిచాడు.. అతను అరవకుండా,డ్యాన్స్ చేయకుండా, ఏడవకుండా, చేతులు ఎత్తకుండా, అమితాబ్‌ను కౌగిలించుకోకుండా చాలా ప్రశాంతంగా కూర్చున్నారు.. నీరజ్ ఒక శాస్త్రవేత్త, Ph.D. మరియు కోల్‌కతాలోని ఒక విశ్వవిద్యాలయానికి వైస్-ఛాన్సలర్.. అతను ఆహ్లాదకరమైన మరియు సరళమైన వ్యక్తిత్వం కలిగి ఉన్నారు.. డా. ఎ.పి.జె.తో కలిసి పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పారు.. నేను మొదట నా గురించే ఆలోచించేవాడిని.. అబ్దుల్ కలాం ప్రభావంతో నేను ఇతరుల గురించి మరియు దేశం గురించి కూడా ఆలోచించడం ప్రారంభించానని చెప్పారు.. నీరజ్ ఆటను మొదలుపెట్టారు.. అతను ప్రేక్షకుల పోల్‌ను ఒకసారి ఉపయోగించాడు, కానీ అతను లి"డబుల్ డిప్" లైఫ్‌లైన్‌ని కలిగి ఉన్నందున, అతను దానిని మళ్లీ ఉపయోగించుకునే అవకాశం పొందాడు.. అతను అన్ని ప్రశ్నలకు సులభంగా సమాధానం చెప్పాడు.. అతని తెలివితేటలు ఆకట్టుకున్నాయి.. అతను రూ.3,20,000 మరియు సమానమైన బోనస్ మొత్తాన్ని గెలుచుకున్నాడు, ఆ పై విరామం లభించింది.. విరామం తర్వాత అమితాబ్ "ముందుకు వెళ్దాం డాక్టర్ సాహబ్ అన్నాడు.. ఇదిగో పదకొండో ప్రశ్న "అని ప్రకటించాడు, అప్పుడే నీరజ్ "సార్ నేను నిష్క్రమించాలనుకుంటున్నాను" అని చెప్పాడు.. అమితాబ్ ఆశ్చర్యపోయాడు.. ఎవరైనా చాలా బాగా ఆడుతున్నారు, ఇంకా మూడు లైఫ్‌లైన్లు మిగిలి ఉన్నాయి మరియు కోటి (రూ1,00,00,000) గెలుచుకునే మంచి అవకాశం ఉన్నందున నిష్క్రమిస్తున్నారా? "ఇంతకు ముందెప్పుడూ ఇలా జరగలేదు" ఎందుకు క్విట్ అంటున్నావు అని అడిగాడు... నీరజ్ ప్రశాంతంగా సమాధానమిచ్చాడు.. "ఇతర ఆటగాళ్లు వేచి ఉన్నారు, వారు నా కంటే చిన్నవారు.. వారికి కూడా అవకాశం రావాలి..నేను ఇప్పటికే చాలా డబ్బు గెలుచుకున్నాను.. 'నాకు ఉన్నది చాలు' అని నేను భావిస్తున్నాను. నాకు అంతకుమించి కోరిక లేదు..." అమితాబ్ దిగ్భ్రాంతి చెందాడు మరియు అక్కడ ఒక క్షణం నిశ్శబ్దం.. అప్పుడు అందరూ లేచి నిలబడి చాలాసేపు చప్పట్లు కొట్టారు.. ఈ రోజు మనం చాలా నేర్చుకున్నాం.. ఇలాంటి వ్యక్తిని చూడటం చాలా అరుదు అని అమితాబ్ అన్నారు.. నిజం చెప్పాలంటే, ఇతరులకు అవకాశం రావడం గురించి ఆలోచించే మరియు తమ వద్ద ఉన్నదానికంటే ఎక్కువ అని భావించే వ్యక్తిని నేను ఇదే మొదటిసారి చూడటం అతనికి మనస్ఫూర్తిగా సెల్యూట్ చేస్తున్నాను అని అమితాబ్ అన్నారు.. నేడు ప్రజలు కేవలం డబ్బు వెంటే ఉన్నారు.. ఎంత సంపాదించినా తృప్తి ఉండదు,దురాశకు అంతం ఉండదు.. డబ్బు వెంటాడుతూ కుటుంబాన్ని, నిద్రను, ఆనందాన్ని, ప్రేమను,స్నేహాన్ని కోల్పోతున్నారు.. అలాంటి సమయాల్లో డాక్టర్ నీరజ్ సక్సేనా లాంటి వారు గుర్తుకు వస్తారు. ఈ యుగంలో, సంతృప్తి మరియు నిస్వార్థ వ్యక్తులు దొరకడం కష్టం... అతను గేమ్ నుండి నిష్క్రమించిన తర్వాత, ఒక అమ్మాయి హాట్ సీట్‌లో కూర్చుని తన కథను పంచుకుంది.. "మేము ముగ్గురు కుమార్తెలమైనందున మా నాన్న మమ్మల్ని మా అమ్మతో సహా బయటకు పంపించేశాడు.. ఇప్పుడు మేము అనాథాశ్రమంలో నివసిస్తున్నాము..." నేను అనుకున్నాను నీరజ్ నిష్క్రమించకపోతే, ఈరోజు చివరి రోజు కాబట్టి, మరెవరికీ అవకాశం లభించదు.. అతని త్యాగం కారణంగా ఈ పేద అమ్మాయికి కొంత డబ్బు సంపాదించే అవకాశం వచ్చింది.. నేటి ప్రపంచంలో ప్రజలు తమ వారసత్వం నుండి ఒక్క పైసా కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేరు.. దాని మీద కొట్లాటలు,హత్యలు కూడా చూస్తున్నాం.. స్వార్థం ప్రబలుతోంది.. కానీ ఈ ఉదాహరణ వినసొంపుగా.. ఇతరుల గురించి,దేశం గురించి ఆలోచించే నీరజ్ లాంటి మనుషుల్లో దేవుడు ఉంటాడు. ఇలాంటి అరుదైన గొప్ప వ్యక్తి ఎందరికో స్ఫూర్తి ప్రదాత.. ఇలాంటి వ్యక్తిని మనం మరువలేము.. ఇలాంటి గొప్ప వ్యక్తి గురించి రాసే అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నాను.. మీ అవసరాలు తీరినప్పుడు, మీరు ఆపి ఇతరులకు అవకాశం ఇవ్వాలి.. స్వార్థాన్ని విడనాడి అందరూ సంతోషంగా ఉంటారు.. ఇది మన అందరం నేర్చుకున్న పాఠం.. మనం ఎల్లప్పుడూ ఇలాంటి వ్యక్తులను ఆరాధించాలి.. అలాగే వారి గురించి నిజాయితీగా రాయడం సమాజం యొక్క అభివృద్ధికి అవసరమని నమ్ముతాను...??



సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి పెన్ పవర్

సెల్యూట్ నీరజ్ సార్.......

## శ్రీరామనవమి శోభాయాత్రలో ముఖ్య అతిథులుగా మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలంగాణ ఎంపీ రఘునందన్ రావు





**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 06 :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని అనంతపురం నగరంలో ఘనంగా నిర్వహించిన శోభాయాత్ర మరియు బైక్ ర్యాలీలో ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు, పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరమంతటా జై శ్రీరామ్ నినాదాలు మార్మోగడంతో పాటు భక్తుల ఉత్సాహం, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా శోభాయాత్ర సాగింది. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ, ఎండను కూడా లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకం. జై శ్రీరామ్ నినాదాలతో అనంతపురం నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీరాముని జీవితం నుండి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. ధర్మాన్ని నిలబెట్టేందుకు శ్రీరాముని వంటి నాయకుల అవసరం ప్రతి కాలంలో ఉంది, అని చెప్పారు.

పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో సానుకూలత, ధార్మికత పెరుగుతాయి. సమాజ నిర్మాణంలో ఇది ఒక మంచి సూచిక అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంపీ రఘునందన్ రావు, కాపు రామచంద్రారెడ్డి, జిల్లా



అధ్యక్షులు కొనగొండ్ల రాజేష్, జిల్లా మాజీ అధ్యక్షులు సంధి రెడ్డి శ్రీనివాసులు, చిరంజీవి రెడ్డి, లలిత్ కుమార్, దూపకుంట్ల శబరి వరప్రసాద్, గల్లా హర్ష, లోకేపల్లి విశ్వనాథ రెడ్డి, హితేన్ జైన్, అజేష్ యాదవ్, పి.వి. రవికుమార్, బొబ్బా కిషోర్ నాయుడు, శ్రీనివాసులు బెంగళూరు బేకరి, మల్లిఖార్జున, అట్టి నరేంద్ర, తోట సూర్యప్రకాష్, డోలా రాజారెడ్డి, డి.చెర్లోపల్లి నారాయణస్వామి, కృష్ణాపురం జమీర్, బిల్లే శ్రీనివాసులు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, కంచుపు నరప్ప, రవికుమార్, అనిల్, నాగేంద్ర, రమేష్ ,బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే డయల్ యువర్ ఆర్టీసీ డియం



**కావలి పెన్ పవర్- ఏప్రిల్ 6 :** సోమవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డియం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీయస్ ఆర్టీసీ , కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు ప్రయాణికులు తమ సమస్యలు , సూచనలు 9959225643 నంబర్ కు ఫోన్ చేసి తెలపాలని, వీలైన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. గత డయల్ యువర్ డియం కార్యక్రమాలలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను దాదాపు అన్నింటిని పరిష్కరించమని ఆయన వివరించారు . కావున తమ డిపో పరిధిలోని కావలి, జలదంకి, కలిగిరి, బోగోలు, కొండాపురం , దగదర్తి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు.

## కన్నుల పండుగగా సీతారామ కళ్యాణ మహోత్సవం





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 6 :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కొమరోలు లోని పట్టాభి రామస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారు మొదట ఆలయంలోని గర్భగుడిలో గల సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభానికి పూజలు చేశారు. మధ్యాహ్నం వేదికపై ఏర్పాటు చేసిన సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుక కార్యక్రమాలలో భక్తులు పాల్గొన్నారు. సీతారాముల విగ్రహాలను పట్టు వస్త్రాల తో అలంకరించి సాంప్రదాయపద్ధంగా కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించారు .ఆ సందర్భంగా హాజరైన భక్తులు అక్షింతలు చల్లి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు .ఆ సందర్భంగా ప్రజలు కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు పానకం వడపప్పు పంపిణీ చేశారు.

## శీలంవారిపల్లిలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్, ఏప్రిల్ 6 :** సీఎస్ పురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీ రామనవమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న కోదండరామస్వామి 40వ కళ్యాణ మహోత్సవంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. శ్రీ.సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామీ వార్లను కదిరి బాబురావు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య సీతారాముల కళ్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవము శాస్త్రోకతంగా, సంప్రదాయంగా జరిగింది. మొదటగా కార్యక్రమంలో మహాగణపతి పూజను ఘనముగా నిర్వహించారు ఆ తర్వాత వృద్ధి అభ్యుదయాలను కాంక్షిస్తూ పుణ్యహావచనము జరిగింది కళ్యాణ మహోత్సవం వేడుకలలో తలంబ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. భక్తులకు ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసారు. అనంతరం కదిరి వెంకట నరసయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్ రావు , కదిరి పార్థసారథి, సర్పంచ్ షేక్ బుజ్జి, ఉప సర్పంచ్ టి బాబురావు, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి, ,ఇరగని చలపతి రావు, వాకా ఆదినారాయణ, పిడుగు హరి నారాయణ, మామిడేల పూర్ణచంద్రరావు, దుగ్గి రెడ్డి జయ రెడ్డి, దొనపాటి మోహన్ రెడ్డి, కదిరి నరసింహ, శీలం మాలకొండయ్య, కొట్టే శ్రీనివాసులు మేస్త్రి, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భాజపా 45వ ఆవిర్భావ దినోత్సవం

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 06 :** భారతీయ జనతా పార్టీ 45వ, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఒంగోలులో బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మోటర్ సైకిల్ ర్యాలీ లో పాల్గొని భారతీయ జనతా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ 1980 ఏప్రిల్ ఆరో తారీఖున భారతి జనతా పార్టీ స్థాపించబడిందని పార్టీ మొట్టమొదటి అధ్యక్షులుగా అటల్ బిహారీ వాజ్ పాయి ని నియమించడం జరిగిందని తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం వాజ్ పాయి తో సహా ఎల్.కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, విజయరాజె సింధియా లు పార్టీని అంచలంచెలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. బిజెపి కార్యకర్తల కృషి, పట్టుదల,అంకితభామే కారణంగా 1984లో రెండు సీట్లు గెలిచిన భారతీయ జనతా పార్టీ అంచలంచెలుగా ఎదుగుతూ నేడు దేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ని గెలిపించుకోవడం జరిగిందన్నారు. దేశ భద్రత,అభివృద్ధి భారతీయ జనతా పార్టీ.. నరేంద్ర మోడీ లాంటి నాయకులు వల్లే అవుతుందని నేతలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీ బలపడటం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా భాజపా అధ్యక్షులు శెగ్గం శ్రీనివాస రావు,పి.వి. శివారెడ్డి,నిడమానూరి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పదసంచలనం కార్యక్రమం








**రాజంపేట పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 6 :** నేడు రాజంపేటలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పద సంచలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇది జూనియర్ పల్లి సాయి విద్యాలయ పాఠశాల నుండి నూనారిపల్లి మీదగా సమద్ థియేటర్ నుండి ఆర్ఎస్ రోడ్డు మీదగా పాత బస్టాండ్ నుండి మెయిన్ రోడ్డు మీదగా మార్కెట్ ప్రవర్త ఆసుపత్రి ఆఫీసర్స్ క్లబ్ నుండి నునారు పల్లి రోడ్డు మీదగా తిరిగి సాయి విద్యాలయ పాఠశాలకు చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విభాగ్ ప్రముఖ కే రెడ్డప్ప మాట్లాడుతూ ప్రపంచంలో కెల్లా అతిపెద్ద దేశభక్తి కలిగి సేవ తత్పరంతో పనిచేస్తున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ అని అన్నారు 1925 సంవత్సరంలో ప్రారంభించి నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సంస్థ అని ఈ 100 సంవత్సరాల్లో దేశంలో అనేక రంగాల్లో అనేక సంస్థలను ప్రారంభించి అందరికీ ఈ దేశంలో దేశం పట్ల దేశభక్తి ప్రేమ కలిగేటట్లు వ్యక్తిగతంగా వారికి శారీరకంగా యోగ కరసాము లాంటి ఆటపాటలతో వేలాది లక్షలాదిమంది వ్యక్తులను తయారు చేసినటువంటి సంస్థ దేశంలో ఎక్కడ ఏ విపత్తు జరిగిన అందరికంటే ముందుండి పని చేసేవారు ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులని వారన్నారు ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా గీతాంజలి విద్యాసంస్థల అధినేత సంభావ వెంకటరమణ ఆర్ఎస్ఎస్ నాయకులు సుబ్రహ్మణ్యం అఖిల్ బిజెపి నాయకులు పోతు గుంట రమేష్ నాయుడు సాయి లోకేష్ తదితర అనేకమంది స్వయం సేవకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంత తేడా వచ్చాక తీసేయొచ్చుగా చంద్రబాబు.. ఇంకా నాన్చటమా?



**హైదరాబాద్ పెన్ పవర్:** గతంతో పోలిస్తే చాలా విషయంలో మారారు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. అయితే.. కీలకమైన కొన్ని విషయాల్లో ఆయనలో పాత వాసనలు అలానే కనిపిస్తున్నాయి. పార్టీ గీతను దాటిన తెలుగు తమ్ముళ్లపై చర్యల కత్తి ఝుళిపించే విషయంలో విపరీతమైన నానుడి ధోరణిని ప్రదర్శిస్తుంటారు. దీన్నో అడ్వాంటేజ్ గా తీసుకుంటారు కొందరు నేతలు. స్థానికంగా ఉండే అధిపత్య పోరును మొక్కలా ఉన్నప్పుడే కట్ చేయాల్సింది పోయి.. చూసిచూడనట్లుగా ఉండటం.. క్రమశిక్షణ లేని కారణంగా పార్టీలో అదో లొల్లిగా మారటం అప్పుడప్పుడు చోటు చేసుకుంటూ ఉంటుంది.

ఈ తటపటాయింపు మరికొందరు నేతలు అవకాశం తీసుకునేలా చేస్తుంది. గీత దాటిన ఎవరైనా సరే.. చర్యలు సీరియస్ గా ఉంటాయన్న సందేశాన్ని పంపే విషయంలో చంద్రబాబు గతంలో మాదిరే వ్యవహరిస్తున్నారు. అందుకు కొలికపూడి వ్యవహారమే ఒక ఉదాహరణగా చెప్పాలి. తిరువూరు ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీ నేత కొలికపూడి శ్రీనివాసరావు.అయితే.. తిరువూరు పార్టీ నేతలకు.. ఎమ్మెల్యేకు మధ్య లడాయి నడుస్తోంది. దీన్ని రాజీ చేయటమో.. లేదంటే చర్యలు తీసుకోవటమో చేయాలి. కానీ.. ఇవేమీ చేయని చంద్రబాబు తీరుతో ఈ ఇష్యూ అంతకంతకూ ముదురుతున్న పరిస్థితి. తాజాగా నందిగామ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు మంత్రులు.. ఎమ్మెల్యేలు హాజరయ్యారు. తరచూ వార్తల్లోకి వస్తూ.. పార్టీ పంచాయితీల పెద్దగా మారిన కొలికపూడి ఇష్యూపై పార్టీ అధినాయకత్వం సీరియస్ గా ఉంది.చంద్రబాబు పర్యటనకు సందర్భంగా ఈ వాదనకు బలం చేకూరేలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. హెలిప్యాడ్ కు చేరుకున్న చంద్రబాబును తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి నమస్కరించారు. అయితే.. చంద్రబాబు ఒక్క క్షణం ఆయన్ను చూసి.. పక్కనున్న నేతను భుజం తట్టారు. కొలికపూడిని మాత్రం పలుకరించలేదు. చంద్రబాబును కలిసేందుకు మహిళా నేతలు.. ఇతర నేతలు ముందుకు రావటం.. వారికి చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వటంతో కొలికిపూడి ఒంటరి అయినట్లుగా సీన్ మారింది.ఇలాంటి పరిస్థితి కంటే కొలికిపూడి ఇష్యూను సెటిల్ చేయటం.. లేదంటే ఆయనపై చర్యలు తీసుకోవాలే తప్పించి.. ఇలా వ్యవహరించటం ద్వారా స్థానిక పంచాయితీ పరిష్కారం కాకుండా ఉంటుందన్న విషయాన్ని చంద్రబాబు ఎందుకు మిస్ అవుతున్నట్లు? అన్నది ప్రశ్న. గతంలోనూ ఇలానే ఇష్యూలను నాన్చేవారు. అవి కాస్తా ముదిరి పాకాన పడేవి. ఇప్పుడు కూడా అదే ధోరణిని ప్రదర్శించటాన్ని పలువురు తప్పు పడుతున్నారు.

# ఇజ్రాయెల్ తెగింపు.. ఇద్దరు యూకే ఎంపీల నిర్బంధం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన ఇద్దరు బ్రిటన్ పార్లమెంటు సభ్యులను (ఎంపీలు) ఇజ్రాయెల్ అధికారులు అడ్డుకుని నిర్బంధించడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనను బ్రిటన్ తీవ్రంగా పరిగణిస్తోంది. యూకే విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ ఈ చర్యను ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఖండించారు. ఈ మేరకు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి.లేబర్ పార్టీకి చెందిన యువాన్ యాంగ్, అబ్తిసామ్ మొహమ్మద్ అనే ఇద్దరు మహిళా ఎంపీలు శనివారం లండన్‌లోని లుటాన్ విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. యువాన్ యాంగ్ ఎర్లీ, వుడ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, అబ్తిసామ్ మొహమ్మద్ షెఫీల్డ్ సెంట్రల్‌కు ఎంపీగా ఉన్నారు. టెల్అవీవ్‌లోని విమానాశ్రయంలో దిగిన వెంటనే ఇజ్రాయెల్ భద్రతా సిబ్బంది వారిని అడ్డుకుని నిర్బంధించినట్లు తెలుస్తోంది. అయితే కొంత సమయం తర్వాత వారిని విడుదల చేశారు.ఈ ఘటనపై ఇజ్రాయెల్ స్పందించింది. తమ భద్రతా దళాల కార్యకలాపాలను డాక్యుమెంట్ చేయడంతో పాటు తమపై వ్యతిరేకతను పెంచేందుకు ఆ ఎంపీలు వచ్చారని ఆరోపించింది. అందుకే వారి రాకను అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ పేర్కొంది.

ఇజ్రాయెల్ చర్యపై యూకే విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ తీవ్రంగా స్పందించారు. "ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లిన యూకే పార్లమెంటరీ ప్రతినిధి బృందంలోని ఇద్దరు ఎంపీలను అక్కడి అధికారులు నిర్బంధించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. వారి చర్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మా ఎంపీలతో వారు ఈ విధంగా వ్యవహరించడం సరికాదు. ఇదే విషయాన్ని అక్కడి ప్రభుత్వంలోని నా సహచరులకు స్పష్టం చేశాను" అని లామీ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం తమ ప్రభుత్వం ఇజ్రాయెల్ - హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ, గాజాలో శాంతి నెలకొల్పడం వంటి కీలకమైన అంశాలపై దృష్టి సారించిందని లామీ స్పష్టం చేశారు. ఇలాంటి సమయంలో యూకే ఎంపీలను నిర్బంధించడం ఇరు దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇద్దరు యూకే ఎంపీలను నిర్బంధించిన ఘటనను బ్రిటన్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఇజ్రాయెల్‌తో ఉన్నత స్థాయిలో చర్చలు జరిపే అవకాశం ఉంది. ఒకవైపు గాజాలో శాంతి కోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది.

# ఆర్ఎస్ఎస్ టార్గెట్...రాహుల్ చెప్పినట్లే అవుతుందా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో వక్ఫ్ సవరణ బిల్లు 2025 పార్లమెంట్ ఆమోదం పొందింది. అయితే దాని ప్రకంపనలు మాత్రం దేశమంతా అలాగే ఉన్నాయి. ఈ బిల్లు చట్టం అవుతున్న వేళ అడ్డుకునేందుకు ఇతర మార్గాలను ప్రత్యర్థులు అన్వేషిస్తున్నారు. కొందరు సుప్రీంకోర్టుకు వెళు తున్నారు. మరి కొందరు రాష్ట్రపతి అపాయింట్మెంట్ తీసుకుని బిల్లు మీద సంతకం చేయకుండా విన్నపం చేయాలని చూస్తున్నారు

వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో అయితే దేశంలోని విపక్షాలు అన్నీ ఆగ్రహంగానే ఉన్నాయి. ఇక ప్రత్యేకించి ఒక వర్గం నాయకులు అయితే నిరసనలు వ్యక్తం చేస్తూనే ప్రతిపక్షాల నిస్సహాయత మీద కూడా ఫైర్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీ వక్ఫ్ బిల్లుని కేంద్రం ఆమోదించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే అని దుయ్యబెట్టారు. బీజేపీ ఆలోచనలను కూడా ఆయన తప్పుపట్టారు.

అంతటితో ఆగని ఆయన ఆర్ఎస్ఎస్ తర్వాత టార్గెట్ ఏమిటో కూడా చెప్పారు. ఆర్ఎస్ఎస్ కాథలిన్ చర్చిలను క్రైస్తవ సమాజాన్ని టార్గెట్ చేసే అవకాశం ఉందని ఆయన ఎక్స్ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. దానికి ఆయన ఆర్ఎస్ఎస్ తన వెబ్ సైట్ లో రాసిన ఒక వ్యాసాన్ని ఉదహరిస్తున్నారు. భారత దేశంలో కాథలిన్ సంస్థలకు ఏకంగా ఏడు కోట్ల హెక్టార్ల భూమి ఉందని ఆ వ్యాసంలో రాసిన విషయాన్ని ట్వీట్ లో పంచుకున్నారు. ఈ రోజుకు దేశంలో అతి పెద్ద ప్రభుత్వేతర భూ యజమానులుగా కాథెలిన్ సంస్థలు ఉన్నాయని ఆర్ఎస్ఎస్ పేర్కొంది అని రాహుల్ గాంధీ గుర్తు చేస్తున్నారు.

తాను వక్ఫ్ బిల్లు ముస్లింల మీద దాడిగా గతంలోనే చెప్పాను అని ఆయన అంటున్నారు. ఇపుడు చూస్తే ఇతర వర్గాలను కూడా ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా చేసుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రస్తుతం క్రైస్తవ సమాజం కూడా ఇబ్బందులో పడినట్లే అని తేల్చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఆర్ఎస్ఎస్ వెబ్ సైట్ వ్యాసంలో ఏముంది అన్నది చూస్తే కనుక దేశంలో ఎవరికి ఎంత ఎక్కువ భూమి ఉంది అంటూ కాథలిన్ చర్చి వర్సెస్ వక్ఫ్ బోర్డు చర్చ అని హెడ్డింగ్ తో ఆ వ్యాసం సాగుతుంది. ఇక కాథలిన్ సంస్థలకు దఖలు పడిన భూమిలో అత్యధిక భాగాని బ్రిటిష్ పాలకులు ఈ దేశాన్ని ఏలుతున్న కాలంలో అంటే 1927లో ఇండియన్ చర్చి చట్టం ద్వారా దఖలు పడిందని పేర్కొన్నారు.వలసవాదుల కాలంలో లీజుగా తీసుకున్న ఈ తరహా భూములను ఇక మీదట చర్చి ఆస్తిగా గుర్తించబోమని 1965 నాటి ప్రభుత్వ ఉత్తర్వులను కూడా ఈ వ్యాసంలో గుర్తు చేశారు. ఇలా సాగిన ఈ వ్యాసాన్ని ఇపుడు రాహుల్ తన ట్వీట్ లో ప్రస్తావిస్తే బీజేపీ ఆర్ఎస్ఎస్ టార్గెట్ కాథలిన్ చర్చి భూములే అని కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలా కూడా ఆరోపిస్తున్నారు. మరి అలా జరుగుతుందా రాహుల్ చెప్పిందే అవుతుందా అన్నది చూడాలి. ఏది ఏమైనా రాహుల్ వ్యాఖ్యలు అయితే ఇపుడు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి.

# వైసీపీ సోలో : మిత్రులు లేరా... వద్దా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయం అంటేనే మందితో పని. కలసి సాగడం. నంబర్ పెంచుకోవడం. ప్రజాస్వామ్యంలో నంబర్ కి ఉన్న విలువ దేనికీ లేదు. ఈ విషయం బాగా తెలిసి నంబర్ గేం లో తలపండిన వారు చంద్రబాబు అయితే ఆయనకు పూర్తి ఆపోజిట్ గా జగన్ ఉంటారు. తాను సింగిల్ అంటారు. సోలోగానే సో బెటర్ అంటారు.

వైసీపీ పుట్టాక మూడు సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసింది ఒకటి విజయం సాధించింది. అయితే ఇవన్నీ సోలోగానే. అంతా జగన్ క్రెడిట్ లోనే. ఓటమి కూడా ఆయనే తీసుకోవాలి అన్నది కూడా ఉంది. అయితే రాజకీయాలు ఒకప్పటిలా లేవు కాంగ్రెస్ పార్టీ ఏకంగా నాలుగు దశాబ్దాల పాటు ఈ దేశాన్ని ఒంటి చేత్తో పాలించింది. ఎంతో సాధించింది కానీ ఈ రోజుకు చూస్తే కాంగ్రెస్ ఒంటరి పోరు అంటే ఆలోచిస్తుంది.

తనకు నచ్చినా కాకపోయినా అందరితో కలసి వెళ్తోంది. అన్నీ పంచుకుంటోంది. అనేక రాష్ట్రాల్లో అలా కాంగ్రెస్ ఉనికిని కాపాడుకుంటోంది. దీని ఫలితాలు ఏదో నాటికి అయితే వస్తాయని బలంగా నమ్ముతోంది. ఇక ప్రాంతీయ పార్టీలలో బలంగా ఉన్న తమిళనాడులోని డీఎంకే సైతం పొత్తులు కడుతోంది.

అలాగే తెలంగాణాలో బీఆర్ఎస్ కొంతకాలం లెఫ్ట్ పార్టీలతో దోస్తీ నెరపింది. ఉద్యమ కాలంలో అయితే ఎందరితోనో కలిసి కూడింది 2009 ఎన్నికల్లో టీడీపీతో 2004లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునే ఎదిగింది. ఇక ఏపీలో చూస్తే జనసేన మొదటి నుంచి పొత్తులతోనే వస్తోంది. తెలుగుదేశం గురించి చెప్పాల్సింది వేరేగా లేదు పొత్తులకే కొత్త భాష్యం చెబుతూ ఎప్పటికప్పుడు ఎదుగుతూ వస్తోంది. పొత్తుల వల్ల అత్యధికంగా లాభపడిన పార్టీగా కూడా టీడీపీకి పేరుంది.

మరి రాజకీయం ఇంతలా విపులంగా గతాన్ని వర్తమానాన్ని విడమరచి చెబుతూంటే వైసీపీ మాత్రం సోలో గీతాలన ఆలపిస్తోంది. ఒంటరి పోరుకే రెడీ అంటోంది ఆ పార్టీ నాయకులు అదే మాట మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని ఏకంగా టీడీపీ కూటమిలో కలిపేయడం ద్వారా అంబటి రాంబాబు తమకు ఎప్పటికీ ఇండియా కూటమి వైపు వెళ్ళే ఉద్దేశ్యమే లేదని చెప్పేశారు.

అలాగే ఏపీలో వామపక్షాల విషయం కూడా వైసీపీ పట్టించుకోవడం లేదు ఇప్పటిదాకా పార్టీ ఒంటరిగానే ఆందోళనలు చేసింది. ఫ్యూఅర్ లో కూడా అదే రకమైన ఆలోచనలో ఉంది. నిజానికి చూస్తే ఏపీలో వామపక్షాలను కలుపుకుని పోతే వైసీపీకి బెటర్ అన్నది ఉంది. వారికి బలం తక్కువగా ఉన్నా సిద్ధాంత బలం ఎక్కువ.

పైగా వారు ఉద్యమాలు చేస్తే అవి జనములోకి బాగా వెళ్తాయి. వారి దన్ను ఉంటే వైసీపీ నిరసనలూ హైలెట్ అవుతాయి. కార్మిక వర్గాలలో బలమైన సంఘాలు వారికి ఉన్నాయి. ప్రతీ నియోజకవర్గంలో కనీసంగా రెండు వేల ఓట్ల దాకా వామపక్షాలకు ఉంది అని ఒక లెక్క చెబుతారు.మరి ఢీ అంటే ఢీ కొడుతున్న ఏపీ రాజకీయాల్లో ప్రతీ ఒక్క ఓటీ కీలకమే అని వేరేగా చెప్పాల్సింది లేదు. ఆ విధంగా చూసుకుంటే కనుక కామ్రేడ్స్ లో చెలిమి వైసీపీకి మేలు అని అంటున్నారు. వారు చాలా వేగంగా జనాల ఒపీనియన్ ని చేంజ్ చేయగలరు అని అంటారు. వైసీపీ తానుగా విమర్శించే జనాలలో వచ్చే ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది. అదే కామ్రేడ్స్ చేసే విమర్శలకు ఒక విలువ గౌరవం ఉంటాయని అంటున్నారు.

అయితే వైసీపీ ఆలోచనలు మాత్రం ఒంటరి పోరుకే సై అన్నట్లుగా ఉన్నాయని అంటున్నారు. మరో నాలుగేళ్ళలో ఎన్నికలు ఉన్నాయి. ఇంకా చాలా దూరం ఉంది. ఈ మధ్యలో ఏమైనా మార్పులు ఉంటాయా లేదా అన్నది తెలియదు కానీ వైసీపీ అధినాయకత్వం ధోరణి చూస్తే కనుక ఒంటరి పోరుకే రెడీ అన్నట్లుగానే ఉంది అని అంటున్నారు. వామపక్షాలు కూడా వైసీపీ ఫిలాసఫీ తెలుసు కాబట్టి ఆ వైపుగా ఎలాంటి ఆశలు పెట్టుకోవడం లేదు అని కూడా అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలతో బలంగా ఉన్న ఏపీ రాజకీయాల్లో వైసీపీ ఒంటరి పోరు ఆ పార్టీకి ఏ మేరకు మేలు చేస్తుంది. ఏ తీరం చేరుస్తుంది అన్నది అయితే వేచి చూడాల్సిందే మరి.

# అయోధ్య రాముడికి 'సూర్య'తిలకం.. చూసి తీరాల్సిన అద్భుతం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశమంతా శ్రీరామ నామస్మరణతో పులకించిపోతోంది. భక్తులు రామయ్య ఆలయాలకు పోటెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండుగలా జరుగుతున్నాయి. గత ఏడాది జనవరిలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట జరిగిన తర్వాత ఇది రెండవ శ్రీరామనవమి. ఈ శుభ సందర్భంగా అయోధ్య ఆలయంలో ఒక అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి విగ్రహం నుదిటిపై సూర్య కిరణాలు తిలకంలా ప్రకాశించాయి. ఈ అపురూప ఘట్టాన్ని భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఆలయ నిర్మాణం సమయంలోనే సూర్య కిరణాలు స్వామివారి నుదిట తిలకం దిద్దేలా శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా రూపొందించారు. ఈ అద్భుత దృశ్యానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.అయోధ్య రామాలయం నిర్మాణం అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్తలు, నిపుణులు మరియు కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు సంయుక్తంగా అయోధ్య రామాలయంలో ఈ సూర్య తిలకం వ్యవస్థను ఏర్పాటు చేశారు. గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్య కిరణాలు పడేలా దీనిని రూపొందించారు.

**కటకాలతో ప్రత్యేక ఏర్పాట్లు:**

రామయ్య విగ్రహం నుదుటిపై సూర్య కిరణాలు పడటానికి ఆలయం మూడవ అంతస్తులో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. కుంభాకార - పుటాకార కటకాలను ఉపయోగించి, వాటిని పైపులతో అనుసంధానించి ఒక ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించారు. ఆలయం పైభాగంలో సూర్యకాంతిని గ్రహించడానికి ఒక పరికరం ఏర్పాటు చేశారు. అక్కడ గ్రహించిన కాంతి, పైపుల లోపల అమర్చిన కటకాల ద్వారా ప్రసరించి, బాలరాముడి నుదుటిపై అచ్చంగా తిలకం వలె కనిపిస్తుంది. ఈ అద్భుత దృశ్యాన్ని చూడటానికి భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.

ప్రతి శ్రీరామ నవమి రోజున ఈ సూర్య తిలకం ఆవిష్కృతం అవుతుంది. దీని కోసం ప్రత్యేకమైన మెకానిజం ఉంది. గేర్ టీత్ మెకానిజం ద్వారా 365 రోజులు సూర్యకాంతిని గ్రహించే అద్దం కదులుతూ ఉంటుంది. సరిగ్గా శ్రీరామనవమి సందర్భంగా, అది నిర్ణీత స్థానానికి చేరుకుంటుంది, తద్వారా సూర్య కిరణాలు బాలరాముడి నుదుటిపై తిలకంలా పడతాయి. ఈ ఆలయ నిర్మాణంలో కేవలం వాస్తు శాస్త్రాన్నే కాకుండా, అనేక శాస్త్రీయ , సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని స్పష్టమవుతోంది.

గత ఏడాది రాముడి ప్రాణప్రతిష్ట జరిగిన తర్వాత అయోధ్య రామాలయానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది. కోట్లాది మంది భక్తులు అయోధ్యకు వచ్చి బాలరాముడిని దర్శించుకుని ఆయన ఆశీర్వాదాలు పొందుతున్నారు. మహాకుంభమేళా సమయంలో త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కూడా యూపీలోని అయోధ్యకు వెళ్లి రాముడి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# బుమ్రా వచ్చేశాడుగా... ముంబయి ఇండియన్స్ లో కొత్త జోష్

గాయం నుంచి కోలుకున్న బుమ్రా

బుమ్రా పునరాగమనం చేశాడంటూ ముంబయి ఇండియన్స్ ప్రకటన

ఆర్సీబీతో ఎంఐ మ్యాచ్ లో ఆడనున్న బుమ్రా!




**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై ఇండియన్స్ అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసేలా, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రాబోయే ముంబయి ఇండియన్స్ జట్టులోకి పునరాగమనం చేశాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న బుమ్రా జట్టులో చేరాడని ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ వెల్లడించింది. ఎంఐ ఫ్యాన్స్ కు ఇది నిజంగా పూనకాలు తెచ్చే వార్తే. ఎందుకంటే, ఈ ఐపీఎల్ సీజన్ లో సరైన స్ట్రయిక్ బౌలర్ లేక ఆ జట్టు తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ఇప్పటిదాకా 4 మ్యాచ్ లు ఆడితే, అందులో మూడింట్లో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో, బుమ్రా తిరిగొచ్చాడన్న వార్త అభిమానులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తుతోంది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబయి ఇండియన్స్ ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ఒక వీడియోను విడుదల చేస్తూ ప్రకటించింది. "గర్జించడానికి సిద్ధం" అనే క్యాప్షన్‌తో వీడియోను పంచుకుంది. బుమ్రా తిరిగి రావడం ముంబయి ఇండియన్స్‌కు ఎంతో ఊరటనిచ్చే అంశం. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (%జశీజు%) గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బుమ్రా పునరాగమనానికి మార్గం సుగమం అయింది. బుమ్రా రాకతో

ముంబై ఇండియన్స్ బౌలింగ్ దళం మరింత బలోపేతం అవుతుంది. బుమ్రా రాకతో జట్టుకు ఒక కొత్త ఊపు వస్తుందని భావిస్తున్నారు. బుమ్రా తన కచ్చితమైన యార్కర్లతో ప్రత్యర్థులను కట్టడి చేయగలడు. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఉంటూ జట్టుకు విజయాలు అందించగల సత్తా ఈ రైటార్మ్ పేసర్ సొంతం. ముంబయి ఇండియన్స్ తన తదుపరి మ్యాచ్‌లో రేపు వాంఖడే స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడుతుంది. ఈ మ్యాచ్ లో బుమ్రా ఎలాంటి ప్రభావం చూపిస్తాడన్నది సర్వత్రా ఆసక్తి కలిగిస్తోంది.

# ప్రేక్షకులపై దాడికి ప్రయత్నించిన పాకిస్థాన్ క్రికెటర్

కివీస్‌తో వన్డే సిరీస్‌లో పాక్ ఓటమి

ఆటగాళ్లను హేళన చేసిన ప్రేక్షకులు

పాక్ క్రికెటర్ ఖుష్‌దిల్ షా ఆగ్రహం...

ఓ అభిమానిపైకి దూసుకెళ్లిన వైనం

ప్రేక్షకుల ప్రవర్తనను ఖండించిన పీసీబీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కివీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ క్లీన్ స్వీప్ ఓటమి ఎదుర్కోవడంతో అభిమానులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో, స్టేడియంలో ఆటగాళు ,, అభిమానుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పాక్ క్రికెటర్ ఖుష్‌దిల్ షా ఏకంగా అభిమానులపై దాడికి యత్నించాడు. దీనిపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) స్పందించింది. బే ఓవెల్ మైదానంలో జరిగిన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్ ఓడిపోయింది. దీంతో ఆగ్రహించిన కొందరు అభిమానులు ఆటగాళ్లను దూషించారు. డగౌట్‌లో ఉన్న ఖుష్‌దిల్ షాను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరంగా మాట్లాడారు. వారిని వారించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఖుష్‌దిల్ షా సహనం కోల్పోయి ఒక అభిమానిపైకి వెళ్ళాడు. వెంటనే భద్రతా సిబ్బంది అతన్ని అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ సంఘటనపై పీసీబీ ఒక ప్రకటన విడుదల చేసింది. పాక్ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని దూషించింది విదేశీ ప్రేక్షకులు అని వెల్లడించింది. వారి ప్రవర్తనను ఖండిస్తున్నామని పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసినప్పుడు ఖుష్‌దిల్ షా వారిని వారించడానికి ప్రయత్నించాడని, దీనికి ప్రతిస్పందనగా వారు మరింత అనుచితంగా ప్రవర్తించారని తెలిపింది. స్టేడియం అధికారులు జోక్యం చేసుకుని దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులను బయటకు పంపించారని పీసీబీ పేర్కొంది. కాగా, ఆ ప్రేక్షకుల్లో కొందరు ఆఫ్ఘనిస్తాన్ కు చెందిన వారు ఉన్నట్లు సమాచారం.

# ఐపీఎల్‌కు రిటైర్మెంట్ అంటూ వార్తలు.. క్లారిటీ ఇచ్చిన ధోనీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటర్నెట్ డెస్క్: చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని శనివారం వార్తలొచ్చాయి. చెపాక్ వేదికగా దిల్లీ క్యాపిటల్స్, చెన్నై మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు ధోనీ తల్లిదండ్రులు పాన్ సింగ్, దేవకీదేవీ స్టేడియానికి వచ్చారు. సాధారణంగా వారు మ్యాచ్‌లు చూసేందుకు రారు. కానీ దిల్లీ మ్యాచ్‌కు రావడంతో మాహీ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కథనాలు పుట్టుకొచ్చాయి. మ్యాచ్ అనంతరం ధోనీ ఆ ప్రకటన చేయకపోవడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ధోనీ.. తన రిటైర్మెంట్ వార్తలను ఖండించాడు. సీజన్ పూర్తయ్యేవరకు ఐపీఎల్‌కు వీడ్కోలు పలికే ఆలోచన లేదని పేర్కొన్నాడు. "ఇప్పటికిప్పుడు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించను. నేనింకా ఐపీఎల్‌లో ఆడుతున్నా. ఈ విషయంపై ఏడాదికి ఒకసారి సమీక్షించుకుంటా. ప్రస్తుతం నాకు 43 ఏళ్లు. జులైలో 44వ ఏటలోకి అడుగుపెడతా. ఇంకా ఆడాలా?వద్దా అని నిర్ణయించుకోవడానికి నాకు 10 నెలల సమయం ఉంది. నా రిటైర్మెంట్ ఎప్పుడు అని నిర్ణయించేది నేను కాదు.. నా శరీరం. సీజన్ ప్రారంభానికి ముందు శరీరం సహకరిస్తోందనిపిస్తే ఆడతా. 'ఇక చాలు' అని అనిపించేంతవరకు ఇదే విధానాన్ని కొనసాగిస్తా"

**- మహేంద్ర సింగ్ ధోనీ**

ఇక, ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పేలవ ప్రదర్శన చేస్తోంది. తొలి మ్యాచ్‌లో ముంబయిపై గెలిచిన సీఎస్కే.. తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. చెన్నై తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఏప్రిల్ 8న చండీగఢ్ వేదికగా జరగనుంది.

**సంప్రదాయ దుస్తుల్లో అలయ ఎఫ్ ఎలిగెంట్ లుక్ అభిమానులను ఆకట్టుకుంది**

# చరణ్ ఫ్యాన్స్‌కి కిక్కిస్తున్న జాన్వీ

వరుస ఫోటోషూట్లతో అగ్గి రాజేస్తోంది జాన్వీ కపూర్. సాటి కథానాయికలతో పోలిస్తే జాన్వీ టూమచ్ బోలి గా చెలరేగిపోతోంది. అందుకు సంబంధించిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తున్నాయి. ముఖ్యంగా జాన్వీలోని అల్ట్రా గ్లామరస్ కోణం యువతరానికి స్పెషల్ ట్రీట్‌గా మారుతోంది. ఇటీవల లాక్మేవీక్ లో స్పెషల్ కాన్సెప్ట్ తో రక్తి కట్టించిన జాన్వీ కపూర్.. వేదికపై తనదైన గ్లామర్ ని ఎలివేట్ చేస్తూ మతులు చెడగొట్టింది. ఈ భామ బోల్డ్ షో సోషల్ మీడియాను బ్రేక్ చేసింది. ఇంతలోనే మరో యూనిక్ ఫోటోషూట్ తో రెచ్చిపోయింది. ఈ అల్ట్రా స్టైలిష్ అల్ట్రా గ్లామ్ ఫోటోషూట్ నుంచి వరుస ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో షేర్ అవుతున్నాయి.జాన్వీ టాలీవుడ్ లో అడుగు పెట్టాక మరింతగా రెచ్చిపోతోందని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. అయితే మామ్ శ్రీదేవికి ఉన్న ఇమేజ్ కి భిన్నమైన ఇమేజ్ ని జాన్వీ సొంతం చేసుకుంటోంది. క్లాసిక్ డే నటి శ్రీదేవి గ్లామరస్ పాత్రల్లో నటించినా.. ట్రెడిషన్ పరంగా హద్దులు దాటలేదు. కానీ జాన్వీ అందుకు భిన్నమైన ఇమేజ్ ని తెచ్చుకుంటోంది. ఒక్కోసారి ఈ భామ చెలరేగి గ్లామర్ ని ఎలివేట్ చేస్తుంటే తనను ఉర్ఫీ జావేద్ తో పోలుస్తున్నారు. జాన్వీకి సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉంది. ఈ భామ పోస్టింగులు రక్తి కట్టిస్తున్నాయి. జాన్వీ సోషల్ మీడియా పోస్టింగులపై యూత్ రకరకాల కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా చరణ్ అభిమానులు జాన్వీ బోల్డ్ నెస్ పై రకరకాల కామెంట్లతో విరుచుకుపడుతున్నారు. యంగ్ టైగర్ తో దేవర లాంటి బ్లాక్ బస్టర్ లో నటించిన జాన్వీ బుచ్చి బాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ సరసన క్రీడా నేపథ్య చిత్రం పెద్దిలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా విడుదలైతే జాన్వీకి మరింత మంచి పేరొస్తుందని భావిస్తున్నారు. ఇందులో జాన్వీకి నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో బుచ్చిబాబు అవకాశం కల్పించాడని చెబుతున్నారు.





**కాలాతీతమైన ఆకర్షణతో దివి వద్యా రైజింగ్ స్టార్**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com